
పంట్లు పరిస్థితులపై నివేదిక పంపండి

ఈనాడు డిజిటల్, అమరావతి: పంట్లు (పడవలు) పరిస్థితిపై నివేదిక పంపాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్... కలెక్టర్ బాలాజీకి సూచించారు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఆయనను కలిసిన కృష్ణా జిల్లా కలెక్టర్ నాగాయలంక మండలంలో వరదల తీవ్రతకు కోతకు గురైన ఎదురుమొండి-గొల్లమంద రహదారి పునర్నిర్మాణ అంచనాలను మంగళవారం వివరించారు. ఈ రోడ్డు పునర్నిర్మిస్తే.. 12 వేల మంది జనాభా.. 8 వేల ఎకరాలకు భద్రత ఉంటుందని తెలిపారు. రహదారికి సంబంధించిన నిధులను ఏఐబీ గ్రాంట్ నుంచి తీసుకోవాలని ఈఎన్‌సీకి డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు. ఏటిమొగ నుంచి ఎదురుమొండి, అక్కడి దీవిలోని ఇతర పల్లెలకు రాకపోకల కోసం మెరుగైన పంట్లు అందించాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించిన వ్యయాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సాయం పొందే విషయమై కలెక్టర్‌తో సమన్వయం చేసుకోవాలని తన కార్యాలయ అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న పంట్ల సామర్థ్యం.. నిర్వహణకు ఎలాంటి భద్రత చర్యలు తీసుకుంటున్నారు.. వాటి అమలుపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు చెప్పారు. ఏటిమొగ నుంచి ఎదురుమొండి వరకు వంతెన నిర్మాణం... అత్యవసర ఆవశ్యకతను రహదారులు, భవనాల శాఖకు తెలియజేయాలని ఉపముఖ్యమంత్రి సూచించారు.



ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

పుట్టి.. ముంచుతున్నారు!

- పరిహారానికి కొందరి పాకులాట
- అధికార యంత్రాంగానికి సవాలు
- అర్హులుగా 68 వేల కుటుంబాలు
- పరిశీలనలో మరో 18 వేల అర్జీలు

ఈనాడు, అమరావతి

"లక్ష్మీ... పాత రాజరాజేశ్వరిపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. భర్త లేరు. కూతురుతో కలిసి ఉంటోంది. కూతురు బిడ్డకు జ్వరం వస్తే.. చికిత్స నిమిత్తం బంధువుల ఇంటికి వెళ్లారు. వరదలు తగ్గాక తాను నివాసం ఉండే ప్రాంతానికి వచ్చింది. కానీ అప్పటికే ముంపు నష్టం గణన బృందం వచ్చి ఇంటి యజమాని పేరు రాసుకుని వెళ్లింది. ఆమె ఇంట్లో ఉంటున్న విషయం యజమాని చెప్పలేదు. దీనిపై సచివాలయ ఉద్యోగులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు."

"కుమ్మరిపాలెం వద్ద కొన్ని డివిజన్లను కృష్ణా వరద ముంచెత్తింది. ఒక పూట.. అదీ 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు ఆవాసాల్లోకి నీరు చేరి అదే రోజు తగ్గింది. కానీ తమకు పరిహారం ఇవ్వాలని వారు ఆందోళన చేశారు. దీనికి వైకాపా వత్తాసు పలుకుతోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కనీసం రెండు రోజులు.. ఆపై వరద ఉంటేనే.. పరిహారం ఇవ్వాలి. ఈ పరిస్థితి 38, 39, 40 డివిజన్లలో ఉంది. దీనికి పరిహారం ఇవ్వడం లేదనే కారణం చూపిస్తున్నారు."

..ఇలాంటి ఫిర్యాదులు ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు 18 వేల మంది అందించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వరద ముంపు ప్రాంతాల బాధిత కుటుంబాలకు భారీగా పరిహారం ప్రకటించింది. గతంలో ఇల్లు పూర్తిగా మునిగినా.. ధ్వంసమైనా.. రూ.5 వేలే ఇచ్చేవారు. ప్రస్తుతం విజయవాడ, ఉమ్మడి కృష్ణా జిల్లాలో రూ.25 వేలకు పెంచారు. గ్రౌండు ఫ్లోర్‌లో ఇల్లు మునిగితే రూ.25 వేలు, మొదటి అంతస్తులో వారికి రూ.10 వేలు పరిహారం ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇతర ప్రాంతాల వారికి రూ.10 వేలు చొప్పున, దుకాణాలు మునిగి సరుకు పాడైతే రూ.25 వేలు ప్రకటించారు. దీంతో భారీగా నకిలీలు పుట్టుకొస్తున్నారు. బుడమేరు పొంగి సింగ్‌నగర్.. దాని చుట్టపక్కల ప్రాంతాలను ముంచెత్తింది. దాదాపు 10 రోజులు నీరు నిలిచే ఉంది. కృష్ణా నది కొన్ని ప్రాంతాలను ముంచినా.. ఒక్క రోజులోనే వరద తగ్గింది. దీంతో అక్కడా సమానంగా పరిహారం ఇవ్వాలనే డిమాండ్ వస్తోంది.




జాబితా చూసుకుంటున్న నివాసితులు



నకిలీలతో అసలుకు ఎసరు...

ఎలాంటి ఆధారం లేకుండా నకిలీ వ్యక్తులు తాము నివాసం ఉంటున్న ప్రాంతం మునిగిందని అర్జీలు ఇస్తున్నారు. తమ పేరు నమోదు చేయలేదని కలెక్టరేట్ గ్రీవెన్సులో ఫిర్యాదులు చేశారు. అయితే నివాసం ఉంటున్నట్లు ఒక్క రుజువు చూపడం లేదు. నకిలీల వ్యవహారంతో అసలు లబ్ధిదారులకు అన్యాయం జరిగే వీలుందని వాపోతున్నారు. మొదట సచివాలయాల సిబ్బంది ఇంటింటికి తిరిగి వీఎంసీ ఆధ్వర్యంలో ఎన్యుమరేషన్ చేశారు. వరద పూర్తిగా తగ్గకుండానే ఈ లెక్కలు తీసుకున్నారు. ఆ సమయంలో నివాసం ఉండేవారు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఇళ్లకి తాళాలు వేసి ఉన్నాయి. దీంతో రేషన్ కార్డు మ్యాపింగ్ ద్వారా గణాంకాలు వేశారు. దీనిపై కలెక్టర్ సృజన మరోసారి పరిశీలన చేయించారు. 68 వేల కుటుంబాలను గుర్తించి.. సీఎంవోకు నివేదించారు. ఈమేరకు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో బుధవారం పరిహారం జమ చేయనున్నారు.

అన్నింటిలోనూ కన్నేశారు...

అయితే దీనికి అదనంగా మరో 18 వేల దరఖాస్తులు అందాయి. వీటికి వారు నివాసం ఉండే ఇంటి విద్యుత్తు బిల్లు కానీ, ఇతర నివాసం ఉంటున్న ఆధారం కానీ చూపడం లేదు. అన్నీ కింది పోర్షన్‌లో ఉంటున్నట్లు దరఖాస్తులు అందించడం విశేషం. ఒక పోర్షన్‌లో మూడు గదులు ఉంటే.. ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. అందిన దరఖాస్తులపై ఇంటి చుట్టుపక్కల వారితో విచారణ చేయించి పరిశీలించే అవకాశం ఉందని తేలింది. కేవలం ఇళ్ల విషయంలోనే కాదు.. ఇతర అంశాలు వాహనాలు, గృహోపకరణాల్లోనూ బోగస్ పుట్టుకొస్తున్నాయి.

మరింతగా పరిశీలిస్తేనే..

18 వేల దరఖాస్తుల్లో వాస్తవంగా నివాసం ఉన్న వారు ఎందరనేది విచారణ చేయాల్సి ఉందని కలెక్టర్ సృజన చెప్పారు. పరిశీలించాకే.. వారికి పరిహారం ఇవ్వనున్నారు. సింగ్‌నగర్, పాయకాపురం, జక్కంపూడి, వైఎస్సార్ కాలనీ, వాంబేకాలనీ, న్యూ, పాత రాజరాజేశ్వరిపేట, మిల్క్‌ప్రాజెక్టు.. చిట్టినగర్, మధురానగర్‌ల్లో కొన్ని కాలనీలు, గ్రామీణంలో కొన్ని గ్రామాలు ముంపులో ఉన్నాయి. ప్రస్తుతం కృష్ణలంక, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, రామలింగేశ్వర్‌నగర్‌ల్లో వరద ఒక్క రోజే ఉంది. వారికి పరిహారం ఇచ్చే అంశం పరిశీలనలో ఉంది.


అవనిగడ్డ మండలం రేగుల్లంక వద్ద కోతకు గురైై ఇలా

లంకల్ని కబళిస్తున్న కృష్ణమ్మ

- వరదల ఉద్ధృతికి కనుమరుగవుతున్న భూములు
- లబోదిబోమంటున్న అన్నదాతలు

న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం, మోపిదేవి


లంక భూములను కృష్ణమ్మ కబళిస్తోంది. నది ప్రవాహ ఉద్ధృతికి భూములు క్రమంగా కోతకు గురవ్వడంతో అన్నదాతలు కన్నీటిపర్యంతమవుతున్నారు. తాజాగా కృష్ణా నదికి వచ్చిన వరద లంక భూములపై విరుచుకు పడింది. నీటి ఒరవడికి నది తీరంలోని పంట పొలాలు అంచులు కరిగి నదిలో కలసిపోతున్నాయి. నది పరీవాహక ప్రాంతం వెంట లంకభూముల పరిరక్షణ కోసం ప్రభుత్వం రాతి పేర్పుడు పనులు చేయాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు అన్నదాతలు మొరపెట్టుకుంటున్నారు.

★ తమ పంట భూములు కోతకు గురై నదిలో కలిసిపోతూ విస్తీర్ణం తగ్గిపోతోందని అవనిగడ్డ మండలంలోని రేగుల్లంక, పులిగడ్డ పల్లెపాలెం, దక్షిణచిరువోలులంక, మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, మోపిదేవి వార్పు, పోచిగానిలంక, నాగాయతిప్ప, మెళ్లమర్తిలంక, ఉత్తరచిరువోల్లంక, అయోధ్య, పెదకళ్లేపల్లి గ్రామాలకు చెందిన రైతులు బావురుమంటున్నారు. లంకభూముల రైతులకు చెందిన పంటలతోపాటు భూమి కూడా కృష్ణార్పణమవుతోంది.

★ పులిగడ్డ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం, రేగుల్లంక, పులిగడ్డ ప్రాంతాల్లోని లంకభూములు 400 ఎకరాలు ఉండగా ఇప్పటికే 100 ఎకరాలకుపైగా కృష్ణా నది గర్భంలో కలిసిపోయాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు లంకభూములు పంటలతోపాటు నదిలో కలిసిపోతున్నాయని వారు పేర్కొంటున్నారు.


మోపిదేవి మండలం కోసూరుపాలెం వద్ద కరిగిపోతున్న పొలం గట్లు

ఒక ఎకరం నదిలో కలిసిపోయింది



తాజాగా వచ్చిన వరదలకు నా భూమి ఒక ఎకరం నదిలో కలిసిపోయింది. పంటలతోపాటు భూమి కూడా కొట్టుకుపోయింది. నా సోదరుడికి చెందిన రెండు ఎకరాలు కూడా నదిలో కలిసిపోయింది.

– మండలి వెంకటేశ్వరరావు, రైతు, పులిగడ్డ

కోత నుంచి రక్షించాలి



నేను సొసైటీ భూమిలోని రెండు ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నాను. వరదకు పంటలు పూర్తిగా పోయాయి. భూమి కూడా కొట్టుకుపోయే స్థితిలో ఉంది. నది కోత నుంచి భూములను పరిరక్షించాలి. – చెన్ను శివాజీ, పాత కోట

పొలాలు కనుమరుగు



వరద వచ్చిన ప్రతిసారీ సరిహద్దున ఉన్న పొలాలు కోతకు గురవుతున్నాయి. ఇటీవలి వచ్చిన భారీ వరద తీవ్రనష్టం కలిగించింది. పొలాలు నదిలో కలిసిపోకుండా కూటమి సర్కారు ఆలోచన చేయాలి.

– నాగినేని శేషగిరిరావు, ఉత్తరచిరువోల్లంక

రాతి పేర్పుడు పనులు చేపట్టాలి



పెదకళ్లేపల్లి వద్ద పుష్కర ఘాట్లకు ఇరువైపులా కోతకు గురవుతోంది. దీన్ని అరికట్టాలంటే రక్షణ గోడ నిర్మించాలి.

– అరజా నరేంద్ర, పెదకళ్లేపల్లి

ఉప్పొంగిన పెద్దవాగు

వాగు అవతల వైపు చిక్కుకుపోయిన విద్యార్థులు, రైతులు

విజయవాడ రూరల్ (నున్న), న్యూస్‌టుడే : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి వికాస్ కళాశాల రోడ్డులోని పెద్దవాగు పొంగింది. కొండ ప్రాంతాల నుంచి వచ్చిన వరద రహదారి మీద నాలుగు అడుగుల మేర ప్రవహించింది. దీంతో పొలాలకు వెళ్లిన రైతులతో పాటు, వికాస్ కళాశాల విద్యార్థులు వాగు అవతల వైపున చిక్కుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి వాగు ఉద్ధృతి తగ్గకపోవడంతో అన్నదాతలు, విద్యార్థులు పోలీసులు, గ్రామస్థులకు సమాచారం అందించారు. ట్రాక్టర్లు వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. దీంతో వికాస్ కళాశాల కరస్పాండెంట్ విద్యార్థులకు కళాశాల వసతి గృహంలో బస ఏర్పాటు చేసి వారిని వెనక్కి తీసుకెళ్లారు. రైతులకు కళాశాలలో ఆహారం ఏర్పాటు చేయగా కొంతమంది అక్కడకు వెళ్లారు. రాత్రి 10 గంటల సమయానికి వరద తగ్గే అవకాశం ఉండటంతో వారిని వాగు దాటేంచేందుకు అధికారులు, పోలీసులు ట్రాక్టర్లు ఏర్పాట్లు చేశారు.


పొంగిపొర్లుతున్న వాగు


పోలీసుల బందోబస్తు



వరద తగ్గాక నెమ్మదిగా సాగుతూ..

కొనకళ్ల చేతికి.. ఆర్టీసీ స్టీరింగ్

- విధేయత, అంకితభావానికి గౌరవం
- వరించిన ఛైర్మన్ పదవి
- ఎంపీ సీటు త్యాగానికి ఫలితం

ఈనాడు, అమరావతి

"మిత్రధర్మంలో భాగంగా.. సార్వత్రిక ఎన్నికల పోటీ నుంచి తప్పుకొన్న తెదేపా కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావుకు ఉమ్మడి జిల్లాలో తొలి నామినేటెడ్ పదవి దక్కింది. రాష్ట్ర రవాణా సంస్థ ఛైర్మన్‌గా కొనకొళ్ల నారాయణరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తెదేపా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆయనతోపాటు పలు కార్పొరేషన్ సభ్యులుగా ముగ్గురు నేతలను పదవులు వరించాయి. విధేయత, అంకితభావం, పార్టీ పట్ల నిబద్ధతతోనే.. కొనకొళ్లకు నామినేటెడ్ పదవి లభించినట్లు పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి."


నారాయణరావును అభినందిస్తున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, తదితరులు

తెదేపాలో ఇంతింతై ఎదిగి...

ఆది నుంచి తెదేపాలో కొనసాగుతున్న కొనకొళ్ల... మచిలీపట్నం పార్లమెంటు స్థానం నుంచి రెండు సార్లు ప్రాతినిధ్యం వహించారు. వెనకబడిన సామాజిక వర్గానికి చెందిన ఆయనకు పార్టీలో గుర్తింపు లభించింది. ఆయన తొలిసారి 2009లో బందరు నుంచి పార్లమెంటుకు పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి రామకృష్ణపై విజయం సాధించారు. అనంతరం 2014లోనూ వైకాపా అభ్యర్థి కొలుసు పార్థసారథిపై ఘనవిజయం సాధించారు. 2019లో పోటీ చేసి వైకాపా అభ్యర్థి వల్లభనేని బాలశౌరిపై ఓటమి చెందారు. అనంతరం పార్టీ కోసం పని చేశారు. అప్పట్లో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు పార్టీ సారథ్యం నిర్వహించేవారు. ఆయన అకాల మరణంతో పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా కొనకళ్ల సేవలందించారు. గన్నవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు సైతం నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

రాజకీయంగా ప్రాధాన్యం!

– కొనకొళ్ల నారాయణరావు

ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయంగా నాకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. గత ఎన్నికల్లో పోటీకి వీలులేకపోవడంతో నామినేటెడ్ పదవి ఇచ్చారు. గతంలోనూ 2014లో నేను గెలిచిన తర్వాత లోక్‌సభలో ప్యానల్ స్పీకర్‌గా నా పేరు సూచించారు. పార్టీ నుంచి లోక్‌సభకు మూడు సార్లు పోటీ చేసే వీలు కల్పించారు. ఆర్టీసి ఛైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉంది. ఆర్టీసీ అభివృద్ధికి తగినవిధంగా కృషి చేస్తా. అధినేత నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. 2024లో నాకు సీటు ప్రకటించిన తర్వాత పొత్తులో భాగంగానే జనసేనకు ఇవ్వాల్సి వచ్చింది. ఈ విషయాన్ని బహిరంగ సభల్లోనూ చంద్రబాబు ప్రకటించడం ఆయన సంస్కారానికి నిదర్శనం.

మాట నిలుపుకొన్న చంద్రబాబు...

బందరు నుంచి మూడుసార్లు పార్లమెంటుకు పోటీ చేసిన కొనకళ్ల... నాలుగోసారి కూడా టికెట్ తనకే వస్తుందని గత ఎన్నికల్లో ఆశించారు. అధిష్ఠానం కూడా ఆయన పేరే ప్రకటించింది. కానీ జనసేనతో పొత్తులో భాగంగా బందరు స్థానాన్ని ఆ పార్టీ కోరింది. అప్పటికే సిట్టింగ్ ఎంపీగా ఉన్న బాలశౌరి పార్టీ మారి జనసేనలో చేరారు. 2024లో ఆయన పోటీ చేసి మిత్రపక్షాల అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. ఎన్నికల ప్రచారంలో బాలశౌరి తరపున కొనకళ్ల విస్తృతంగా ప్రచారం కూడా చేశారు. నాడు బహిరంగ సభలో తెదేపా అధినేత చంద్రబాబు.. పార్టీ కోసం తన సీటును త్యాగం చేశారని కొనకొళ్లను పలుమార్లు అభినందించారు. అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామనీ.. సేవలు వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం.. ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా పలు పదవులను కొనకళ్ల నిర్వహించారు. 2009లో నేరుగా పార్లమెంటు ఎన్నికల్లో రంగంలోకి దూకి విజయం సాధించారు.

మరో ముగ్గురు సభ్యులుగా...

తొలిజాబితాలో మరో ముగ్గురు నేతలకు సభ్యులుగా నామినేటెడ్ పదవులు లభించాయి. విజయవాడ సెంట్రల్ నుంచి సింగం వెంకటేశ్వరరావుకు ఏపీ పద్మశాలి సంక్షేమ అభివృద్ధి సంస్థ సభ్యుడిగా పదవి లభించింది. గుడివాడకు చెందిన లోహిత్ సిస్ట్లాకు ఏపీ పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ పదవి లభించింది. పెడన నుంచి ఏపీట్రైకార్‌లో డైరెక్టర్‌గా సలపాటి వీరప్రసాద్‌కు పదవి లభించింది.

పలువురు నిరీక్షణ...

మరోవైపు పలువురు తెదేపా నేతలు ఇంకా నిరీక్షణలో ఉన్నారు. ప్రధానంగా మైలవరం సీటు త్యాగం చేసిన దేవినేని ఉమాకు ఏ పదవి ఇస్తారనేది ఉత్కంఠ నెలకొంది. విజయవాడ పశ్చిమ నుంచి తెదేపా ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్ మీరా (గతంలో పోలీసు గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్), తిరువూరు నుంచి సీటు ఆశించిన శ్యావల దేవదత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం


ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే రాము, రావిలకు గజమాలతో సత్కారం

నందివాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తోందని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి పరిపాలన అందిస్తామని ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మంగళవారం నందివాడ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు మాట్లాడారు. 100 రోజుల పాలనలోనే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కళ్లకు కనిపిస్తున్నాయన్నారు. అయిదేళ్ల వైకాపా పాలనలో గతి తప్పిన రాష్ట్రాన్ని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తిరిగి గాడిలో పెడుతున్నారన్నారు. గుడివాడలో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. నందివాడలో గతంలో ఎన్నడూ లేనంత భారీ మెజార్టీని కూటమికి ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వారు వివరించారు. పొలం పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ బైపాస్‌కు మహర్దశ

ఎమ్మెల్యే రాము చొరవతో రహదారి అభివృద్ధికి చర్యలు

న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం

గుడివాడ ఏలూరు రోడ్డు నుంచి బంటుమిల్లి రహదారి వరకు మూడు కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు అభివృద్ధికి గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం కనీసం మట్టి కూడా వేయలేదు. ఈ మార్గంలో ప్రధాన విద్యా సంస్థలు ఉన్నాయి. పైగా ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా చాలా కాలం కిందట ఈ రోడ్డు నిర్మించారు. అయితే ప్రాధాన్యమున్న ఈ రహదారిపై భారీ గుంతలు పడి వాహనదారులు నిత్యం నరకం చవిచూస్తున్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం రోజూ వేలాది మంది ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతోపాటు వలివర్తిపాడు గ్రామ పరిధిలోని గణేష్ రాయల్ టౌన్‌షిప్, గణేష్ గ్రాండ్, వేద తదితర అపార్టుమెంట్లలో వేలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ అపార్టుమెంట్లకు బస్సాండు నుంచి ఇంటికి చేరాలంటే ఆటోలకు భారీగా చెల్లించుకోవాల్సి వస్తోంది. గుంతలు పెద్దవిగా ఉండడం వల్ల



గుంతలు పూడుస్తున్న పొక్లెయిన్

చాలా మంది ఆటోల వారు తాము బైపాస్ రోడ్డువైపు రామని ఖరాకండిగా చెప్పేస్తున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే రోజూ చుక్కలు కనిపిస్తున్నాయని బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న వారు, ఇతర ప్రాంతాలవారు వాపోతున్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని కనీసం పట్టించుకోలేదు. అనంతరం గుడివాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే వెనిగండ్ల రాము బైపాస్ రోడ్డులోని గుంతలు పూడ్పించారు. ఇటీవల వర్షాలకు మళ్లీ ధ్వంసమై గుంతలు పెద్దవయ్యాయి. సమస్య తీవ్రమవడంతో మూడు రోజుల నుంచి మళ్లీ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే రాము చొరవతో బైపాస్ రోడ్డులో గుంతలు పూడ్చివేత ముమ్మరంగా సాగుతోంది. అలాగే కూటమి ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధికి రూ.68.5 లక్షలు కేటాయించింది. త్వరలో టెండర్లు పూర్తయి పనులు ఊపందుకుంటాయని రహదారులు భవనాల శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆక్వా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించండి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో ఆక్వా కల్చర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం మత్స్యశాఖ అధికారులు, ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించిన ఆయన పలు సూచనలు చేశారు. విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వినియోగాన్ని అరికట్టాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఆక్వా కోళ్ల దాణా దుకాణాలు, మత్స్యశాఖ కార్యాలయాలు, సచివాలయాల్లో నిషేధిత యాంటీబయోటిక్స్ జాబితా ప్రదర్శించాలన్నారు.

స్వర్ణాంధ్ర దార్శనికపత్రంపై సలహాల స్వీకరణకు క్యూఆర్ కోడ్

స్వర్ణాంధ్రప్రదేశ్-2047 దార్శనికపత్రం (విజన్ డాక్యుమెంట్) తయారీపై ప్రజలు తమ సలహాలు, సూచనలు తెలియజేసేలా రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ బాలాజీ కోరారు. దీనిపై ఆయన వీసీ ద్వారా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ప్రజల సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్యూఆర్ కోడ్ రూపొందించిందన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా సర్వేలో పాల్గొన్న వారికి సీఎం సంతకంతో కూడిన ప్రశంసాపత్రం అందుతుందన్నారు.

టవర్ల ఏర్పాటుకు అవకాశాలు..

తోట్లవల్లూరు మండలం పాములలంక వద్ద కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా విద్యుత్తు టవర్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ బాలాజీ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్‌శాఖ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశమై వివిధ అంశాలను సమీక్షించారు. బాపులపాడు మండలం ఎస్‌ఎస్ రంగ



ఆక్వా అభివృద్ధిపై అధికారులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

న్నగూడెం 132 కేవీ సబ్‌స్టేషన్ అప్రోచ్ రోడ్డు వేయాల్సి ఉండగా, నిధుల లేమితో అధికారులు చొరవ తీసుకోవడం లేదని, గుడివాడ మండలం మెరకగూడెం లింగవరం వద్ద 220 కేవీ విద్యుత్ టవర్ల ఏర్పాటుకు, పెడన మండలం కొంకేపూడి వద్ద టవర్ల ఏర్పాటుకు స్థల సమస్య ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. విద్యుత్తు శాఖ ఈఈ భాస్కరరావు, అధికారులు జయకరరావు, రాజగోపాలనాయుడు, భాగ్యరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు మంగళవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజన సంక్షేమశాఖ అధికారిగా బాపట్ల నుంచి జిల్లాకు వచ్చిన ఫణి ధూర్జటి, తాడిగడప మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, తదితరులు కలెక్టర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

పామాయిల్ సాగు ప్రోత్సాహంపై : జిల్లాలో పామాయిల్ సాగును ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉద్యానవన శాఖాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మైక్రో ఇరిగేషన్, ఉద్యానవన శాఖాధికారులు, జిల్లాలోని పామాయిల్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పామాయిల్ సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడి రైతులను సాగు దిశగా ప్రోత్సహించాలని చెప్పారు. ఉద్యానవనశాఖాధికారిణి జ్యోతి, మైక్రో ఇరిగేషన్ పీడీ విజయలక్ష్మి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



కొనకళ్లను సత్కరించిన తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణలత, మహిళా నాయకులు

కొనకళ్లకు అభినందనల వెల్లువ

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, కొనకళ్ల అభిమానులు మంగళవారం ఉదయం నుంచి మచిలీపట్నంలోని ఆయన నివాసానికి బారులుదీరారు. శాలువాలు, పూలదండలతో ఆయనను ఘనంగా సత్కరించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత తదితరులతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు కొనకళ్లకు అభినందనలు తెలిపారు. జిల్లా ప్రజారవాణా అధికారి వాణిశ్రీ, డిపో మేనేజర్ పెద్దిరాజు, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు చంద్రశేఖర్, గోపీనాథ్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

పవిత్రత పరిరక్షణ అందరి బాధ్యత

మంటాడ(పమిడిముక్కల)న్యూస్‌టుడే: స్వామివారి నైవేద్యాల పవిత్రతను పరిరక్షించాల్సిన బాధ్యత విస్మరించారని ఎంపీ బాలశౌరి అన్నారు. తిరుపతి ప్రసాదంలో కల్తీ పదార్థాల వినియోగానికి జరిగిన అపచార నివారణకు మంటాడలోని వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు సనకా కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ క్రతువులో నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. తొలుత ఆలయ కార్యనిర్వహణాధికారి మాధవీలత, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. జనసేన, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



హోమ నిర్వహణలో ఎంపీ బాలశౌరి, నరేష్

హస్తకళలపై శ్రీరామ్‌నరేంద్రకు డాక్టరేట్

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లాలోని హస్తకళల ఆర్థిక విశ్లేషణ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను విజయవాడకు చెందిన వి.శ్రీరామ్‌నరేంద్ర ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. జిల్లాలోని హస్తకళల ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, కళాకారులు ఎదుర్కొంటున్న సవాళ్లు, కొవిడ్ ఈ రంగంపై చూపిన ప్రభావం, లాక్‌డౌన్ కారణంగా హస్తకళ కార్మికుల ఉపాధి అవకాశాలు తగ్గడం తదితర అంశాలపై నాగార్జున వర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగాధిపతి కడిమి మధుబాబు పర్యవేక్షణలో వివరణాత్మక విశ్లేషణ చేశారు.



పట్టా అందుకుంటూ..

పొన్నవోలుపై కేసు నమోదు చేయాలి : మాజీ ఎమ్మెల్సీ

విద్యాధరపురం: తిరుపతి లడ్డూ అపవిత్రంపై పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యలను హైకోర్టు సుమోటోగా తీసుకొని ఆయనపై కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. మల్లికార్జునపేటలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెంకన్న మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంలో రాజ్యాంగ బద్ధ పదవిలో ఉండి నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై వ్యతిరేకంగా ఊరూరా తిరిగి ప్రచారం చేసిన విషయం ప్రజలు గమనించారన్నారు. తిరుపతి లడ్డూను అపవిత్రం చేయడమే కాకుండా పంది కొవ్వుతో ఆవు నెయ్యిని పోల్చి మాట్లాడడం పొన్నవోలు అహంకారానికి పరాకాష్ఠ అన్నారు.

ఏలూరు కాల్వకు నీరు విడుదల

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : ఏలూరు కాల్వకు ఎట్టకేలకు నీరు విడుదల చేశారు. గత నెల 31న భారీ వరదల నేపథ్యంలో కాల్వకు నీటిని ఆపేశారు. ఆ తర్వాత బుడమేరు దాటికి పలుచోట్ల కాల్వ భారీగా గండ్లు పడ్డాయి. దీంతో ఆయకట్టుకు నిరవధికంగా నీరు నిలిపేయడం అనివార్యంగా మారింది. ఈ నేపథ్యంలో పది రోజులుగా నీటి పారుదల అధికారులు గండ్లు పూడ్చివేస్తూ, అవసరమైన మరమ్మతులు చేయడంలో నిమగ్నమయ్యారు. యుద్ధప్రాతిపదికన మంగళవారం నీరు విడుదల చేశారు. ప్రస్తుతం 800 నుంచి 1,000 క్యూసెక్కుల వరకు ప్రవాహం ఉందని, బుధవారం నాటికి మరింత పెంచుతామని నీటి పారుదల ఈఈ కొడాలి బాబు తెలిపారు.

నేడు స్పేస్ ఆన్ వీల్స్ ప్రదర్శన

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం ఇస్రో వారు రూపొందించిన 'స్పేస్ ఆన్ వీల్స్' వాహనం ప్రదర్శన గుడ్లవల్లేరు, గుడివాడలలో ఉంటుందని జిల్లా సైన్సు అధికారి జాకీర్ అహ్మద్ తెలిపారు. ఆయా ప్రాంత హైస్కూళ్ల వద్ద విద్యార్థుల సందర్శనార్థం ఈ వాహనాన్ని నిలుపుతారని పేర్కొన్నారు. విద్యార్థులు సందర్శించి అంతరిక్షంపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు.

139 మంది వీఆర్వోలకు స్థానచలనం

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: బదిలీలపై నిషేధం ఎత్తివేసిన నేపథ్యంలో మచిలీపట్నం డివిజన్ పరిధిలో మొత్తం 139 మంది వీఆర్వోలను స్థానచలనం కలిగించారు. గ్రేడ్-1 వీఆర్వోలు 77 మందిని, గ్రేడ్-2 వీఆర్వోలు 62 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇసుక రీచ్‌లో పనులకు ధరలు ప్రతిపాదించండి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలోని మద్దూరు, రొయ్యూరు, వల్లూరు, శ్రీకాకుళం ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లో తవ్వకం, లోడింగ్, స్టాక్‌యార్డుకు రవాణా తదితర అంశాలకు సంబంధించి గిట్టుబాటు ధరకు సంబంధించిన ప్రతిపాదనలను ఆసక్తి ఉన్న గుత్తేదారులు పంపాలని కలెక్టర్ బాలాజీ కోరారు. కార్మికుల ద్వారా ఇసుక తవ్వి ట్రాక్టర్లలోకి లోడ్ చేసేందుకు, రీచ్ నుంచి స్టాక్‌యార్డ్‌కు రవాణా చేసేందుకు, స్టాక్‌యార్డ్‌లో మెషీన్ ద్వారా ఇసుక లోడ్ చేసేందుకు ప్రతిపాదిత ధరలను ఈ నెల 26 నాటికి జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలను 9100688004 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

పశువుల వ్యాక్సినేషన్ వారంలో నూరుశాతం పూర్తి కావాలి : జిల్లాలో అన్ని పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వారం లోపు నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ పశుసంవర్ధకశాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో బ్రుసెల్లా వ్యాక్సినేషన్ విషయంలో తోట్లవల్లూరు, గన్నవరం, ఘంటసాల మండలాలు, గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్‌లో గుడివాడ, ఘంటసాల మండలాలు వెనుకబాటులో ఉండటాన్ని ప్రశ్నించారు. పశుసంవర్ధకశాఖాధికారి చిన్ననర్సింహులు, డీడీలు శ్రీనివాసరావు, నాగభూషణం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పంటను బట్టి రైతుకు నష్ట పరిహారం ప్రకటించాలి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణా నది వరదలకు దెబ్బతిన్న రైతు, కౌలు రైతులకు వేసిన పంటను బట్టి నష్టపరిహారం ప్రకటించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక బస్టాండ్ కూడలిలో రైతు, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతు సదస్సు



మాట్లాడుతున్న కృష్ణయ్య, పక్కన హరిబాబు

సదస్సులో ముఖ్య అతిథులుగా హాజరైన కృష్ణయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులు పాలయ్యారని పేర్కొన్నారు. విపత్తులు వచ్చినప్పుడు ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. కేంద్ర బృందం వచ్చి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి వెళ్లి 10 రోజులవుతున్నా ఇంత వరకు సహాయం ప్రకటించకపోవడం విడ్డూరమన్నారు. వరి పంటకు ఎకరాలకు రూ.10 వేలు, ఉద్యాన పంటలకు ఎకరానికి రూ.14వేలు పరిహారం ప్రభుత్వం ప్రకటించడాన్ని రైతు సంఘం వ్యతిరేకిస్తోందని తెలిపారు. వాటిని క్రమంగా రూ.25 వేలు, రూ.లక్షకు పెంచాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామని తెలిపారు. లంక పొలాల్లో పాడైన మోటార్లు, ట్రాక్టర్లకు కూడా నష్టపరిహారం అందించాలన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శివనాగేంద్రం, ఉపాధ్యక్షురాలు ఎ.శైలజ, కార్యదర్శి పి.రంగారావు, మండల అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు.

జోగి అనుచరులు చేపలు దోచుకెళ్లారు

పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు ❖ తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి: మాజీ మంత్రి జోగి రమేష్ అండదండలతో వైకాపా నేతలు కొల్లాటి బాలగంగాధరరావు, కొల్లాటి పోతురాజు, సత్యనారాయణ, తిరుమాను రమేష్‌లు తమ 50 ఎకరాల చెరువులోని చేపలను గతంలో దోచుకెళ్లారని కృత్తివెన్ను మండలంలోని శీతనపల్లికి చెందిన పెదసింగు దావీదు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పైగా వైకాపా నాయకులకే సహకరించారని వాపోయారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, బీద రవిచంద్ర, ఆచంట సునీత, ఉండవల్లి శ్రీదేవి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

❖ మాజీ మంత్రి జోగి రమేష్‌తో కలిసి కొల్లాటి పోతురాజు, కొల్లాటి బాల గంగాధరరావు, రేవు ఏసుబాబు, తిరుమాని సత్యనారాయణ, కొల్లాటి ఆంజనేయులు గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిపై దాడి చేశారని వారిపై డీజీపీతో విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ❖ డీఎస్సీ వయోపరిమితి 46 సంవత్సరాలకు పెంచాలని పలువురు నిరుద్యోగులు కోరారు. గత ఆరేళ్లుగా నోటిఫికేషన్ లేకపోవడంతో నష్టపోయామని వివరించారు.



బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.91/-.

గిరిజన సంక్షేమ పథకాలు పునరుద్ధరించండి

విజయవాడ సిటీ: గిరిజనుల అభ్యున్నతికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్ని వైకాపా ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) నాయకులు, విద్యార్థులు విజయవాడ మొగల్రాజపురంలోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు మంగళవారం ఆందోళన నిర్వహించారు. తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాయక్ మాట్లాడుతూ... వైకాపా పాలనలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి జరగలేదని, కొత్త పథకాలు పెట్టకపోగా.. ఉన్నవి అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ కన్వర్టెడ్ గిరిజన గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పీజీటీ ఉపాధ్యాయులను నియమించకపోవడం వల్ల విద్యార్థులకు విద్య దూరమవుతోందని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంలు లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

దసరా ఉత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి: ఎంపీ శివనాథ్



కరదీపికను విడుదల చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఈవో రామారావు, స్థానాచార్య శివప్రసాదశర్మ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించే దసరా ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా భావించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఇంద్రకీలాద్రిపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో దుర్గ గుడి అధికారులు రూపొందించిన దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక, కరదీపికలను ఈవో రామారావు, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అక్టోబరు 3 నుంచి 12 వరకు ఉత్సవాలు విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఉత్సవాలు ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే విధంగా దేవాదాయ శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అమ్మవారి దర్శనం, ప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఈవో రామారావు మాట్లాడుతూ.. ఘాట్ రోడ్డులో రిటైనింగ్ గోడ, శివాలయం మెట్ల మార్గం వద్ద ఫుట్ బ్రిడ్జి ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కమిషనర్ సహకారంతో ఒకవైపు అభివృద్ధి పనులు, మరొక వైపు దసరా ఏర్పాట్లు నిర్విఘ్నంగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఈఈ కోటేశ్వరరావు, స్థానాచార్య శివప్రసాదశర్మ పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

చల్లపల్లి, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులపై ఇసుక అక్రమ రవాణాదారులు దాడులు చేయడం సభ్యసమాజానికి మంచిదికాదని, వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం చల్లపల్లిలోని చండ్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో ఆయన మాట్లాడుతూ చల్లపల్లి మండలం నిమ్మగడ్డలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు వెళ్లిన పోలీసులపై దాడులు చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. సీపీఐ నాయకులు పెనుమత్స రాజారత్నం, సిద్దాబత్తుల వాసు, లంక నాగమల్లి పాల్గొన్నారు.

1200 ప్రాజెక్టుల నమోదు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 సంవత్సరానికి ఇన్‌స్పైరియర్ మనక్ కార్యక్రమం కింద ఇప్పటి వరకు 1200 ప్రాజెక్టులు నమోదయ్యాయని జిల్లా సైన్స్ అధికారి జాకీర్ అహ్మద్ తెలిపారు. గతేడాది జిల్లా నుంచి 1741 ప్రాజెక్టులు నమోదు అయ్యాయని, వీటిలో 175 ప్రాజెక్టులు జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో ఇన్‌స్పైరియర్ మనక్ జిల్లా స్థాయి ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ప్రాజెక్టుల నమోదు సంఖ్యను పెంచాలని ఆయన కోరారు.

క్షేత్ర సహాయకురాలి సస్పెన్షన్

సీతారామపురం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన క్షేత్ర సహాయకురాలిని సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్ర సహాయకురాలు బెజవాడ రామమ్మ సీతారామపురం పంచాయతీ పరిధిలో ఉపాధి పథకంలో పలు అవకతవకలకు పాల్పడినట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆరోపణలపై ఎంపీడీవో బాలసుబ్రహ్మణ్యరెడ్డి ఇటీవల విచారణ చేపట్టి నివేదికను డ్వామా పీడీకి సమర్పించారు. నివేదిక ఆధారంగా రామమ్మను సస్పెండ్ చేస్తున్నట్లు డ్వామా పీడీ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మచిలీపట్నం

●మచిలీపట్నం ●పెడన

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు విస్తృతం


బహుమతులు పొందిన విద్యార్థులతో వర్సిటీ రెక్టార్, రిజిస్ట్రార్ తదితరులు

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ విభాగాల ద్వారా చేసే సేవలు విస్తృతం చేయాలని కృష్ణావిశ్వవిద్యాలయ రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు మాట్లాడుతూ దైనందిన జీవితంలో చిన్న చిన్న అలవాట్లను మార్చుకోవడం ద్వారా సమాజంలో మార్పునకు నాంది పలకవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు ఎన్.ఉష, విజయ కుమారి, రాంబాబు తదితరులు ప్రసంగించారు. వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు స్వరూప, రవి, కవిత తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని లేడీయాంప్తిల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.సుందరలక్ష్మి ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే సేవాభావం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరినాథ్‌బాబు, అధ్యాపకులు విజయశ్రీ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

భూమిలో పోషకాలు గుర్తిస్తే అధిక దిగుబడులు


మాట్లాడుతున్న పద్మావతి, పక్కన ఏవో శివప్రసాద్

గూడూరు, న్యూస్‌టుడే: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.పద్మావతి అన్నారు. మండల పరిధిలోని తరకటూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో వారంలో రెండు రోజుల పాటు మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులు విచ్చలవిడి ఎరువుల వినియోగం తగ్గించుకోవాలన్నారు. భూమిలో ఏయే పోషకాలు ఉన్నాయో తెలుసుకుని అవసరం మేరకు మాత్రమే వినియోగిస్తే పెట్టుబడి తగ్గడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఏఓ శివప్రసాదు, రైతులు కమ్మెల రమణ, తోట వినయ్, యర్రపోతు అర్జునరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిద్దాం..ఆదర్శంగా నిలుద్దాం


16వ వార్డులో అధికారులు, కార్మికుల అవగాహన ర్యాలీ

పెడన, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరూ సామాజిక పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 16వ వార్డులో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలో మినీ డంపింగ్ యార్డ్‌లు పెరిగిపోతున్నాయని, దీని నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపీ కిషోర్, పలువురు శానిటరీ కార్యదర్శులతో పాటు తెదేపా నేతలు వాహబ్‌ఖాన్, ఎండీ హమీదుల్లా తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 6 నుంచి ఏపీటీఎఫ్ మహాసభలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: విజయనగరంలో నిర్వహించే ఏపీటీఎఫ్ 20వ విద్యా వైజ్ఞానిక మహా సభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయనతో పాటు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లంకేష్, సీనియర్ నాయకులు కేవీఎన్‌ఆర్‌ఆర్ ప్రసాద్, ఎస్ఎస్ఆర్‌బీ గుప్తా తదితరులు నగరంలోని వివిధ పాఠశాలలకు కరపత్రాలు పంపిణీ చేశారు. అక్టోబరు 6, 7, 8 తేదీల్లో జరిగే ఈ సభల్లో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సినిమాలు

రేవతి- చిక్‌లెట్స్
మినీరేవతి- నరబలి
సిరికృష్ణ: భలే ఉన్నాడే
సిరివెంకట్: మత్తువదలరా
రామరాజు: సరిపోదా శనివారం
-మచిలీపట్నం కార్పొరేషన్

మదింపులో లోపాలే.. యజమానులకు శాపమై..

న్యూస్‌టుడే, పెడన


ఆస్తి పన్నుల విధింపుపై అవగాహన కల్పిస్తున్న గత కమిషనర్ (పాతచిత్రం)

పెడనలో అసెస్‌మెంట్లు: **7529**
2023 జులైలో కొత్తగా విధించినవి: **570**
మొత్తం అసెస్‌మెంట్లు: **8099**
పురపాలికా ఆదాయం: **రూ.1.7కోట్లు**

పెడన పట్టణంలో ఇటీవల చేపట్టిన ఆస్తి పన్నుల మదింపులో లోపాలతో భవన యజమానులపై పన్నుల భారం అధికంగా పడింది. ఆస్తికి సంబంధించి పత్రాలు ఉన్నాయో లేవో సరిగ్గా నిర్ధారించుకోకుండా రెట్టింపు పన్నులు విధించడాన్ని తప్పు పడుతున్నారు. అధికారుల తీరు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేకరించాల్సిన పత్రాలివే..: ఆ ఇంటి డాక్యుమెంట్, లింక్ డాక్యుమెంట్, భవన నిర్మాణ ప్లాన్, ఆధార్‌లను సేకరించి ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ భవనానికి ప్లాన్ లేకుంటే రెట్టింపు పన్ను విధిస్తారు.

బాధితుల గోడు..: ఇటీవల విధించిన పన్నుల్లో అత్యధికంగా ప్లాన్ లేదని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పన్నులు విధించినట్లు యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు కనీసం తమ ఇంటికి రాకుండానే పన్నులు విధించారని వాపోతున్నారు.

స్క్రూటినీ ఎక్కడ.. : కొత్తగా పన్ను వేస్తుంటే ముందుగా సచివాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా మున్సిపల్ రెవెన్యూ విభాగానికి డాక్యుమెంట్లు పంపిస్తారు. అక్కడి నుంచి మున్సిపల్ ఆర్ఐ లాగిన్‌లోకి వస్తాయి. అక్కడ స్క్రూటినీ తర్వాత మేనేజర్‌కు పంపిస్తారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 50 శాతం మేనేజర్ స్క్రూటినీ చేయాలి. అక్కడి నుంచి కమిషనర్‌కు వివరాలు వెళ్తాయి. ఇలా వెళ్లిన ప్రతిపాదనల్లో 10 శాతం కమిషనర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తారు. ఎలాంటి తనిఖీలు లేకుండానే ఆన్‌లైన్ చేయడంతో మున్సిపల్ డైరెక్టర్, కమిషనర్ కార్యాలయంలో ఆమోదం పొంది యజమానులకు నోటీసులు అందుతున్నాయి. ఈ పన్నులు చూసి ఆందోళన చెందుతున్న యజమానులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు.

అడ్డగోలుగా పన్నులు

మాకు 80.36చ.మీల వైశాల్యంలో కొత్తపేటలో భవనం ఉంది. దీనికి 2016లోనే అనుమతులు తీసుకున్నాం. కానీ అనధికార భవనంగా నమోదు చేసి రూ.4200 పన్ను ఆర్నెల్లకు విధించారు. ఒక అంతస్తుకు రూ.2000కు మించి పన్ను రాదు. మమ్మల్ని సంప్రదించకుండానే పన్నులు విధించారు. కనీసం మా ఇంటికి వచ్చి కొలతలు కూడా తీసుకోలేదు.

- నారగాని సాంబయ్య, కొత్తపేట, పెడన

భవన అనుమతులు ఉన్నా

మఠంవీధిలో 129.21 చ.మీల్లో మాకు రెండతస్తుల భవనం ఉంది. దీనికి భవన నిర్మాణ అనుమతులు ఉన్నాయి. 2016లోనే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులు తీసుకున్నాం. కనీసం మమ్మల్ని అడగకుండా అనధికార భవనం కింద ఆరు నెలలకు రూ.5673 పన్ను విధించి నోటీసులు జారీ చేశారు. మాకు రూ.2500కు మించి పన్ను రాదు. దీనిపై పునఃసమీక్షకు దరఖాస్తు చేశాం.

- నందం శివకుమార్, మఠంవీధి, పెడన

అంత ఎలా కట్టాలి

116.12చ.మీల విస్తీర్ణంలో భవన నిర్మాణానికి జీ+1కు అనుమతులు తీసుకున్నాం. దీనికి ఆర్నెల్లకు రూ.4790 పన్ను విధించారు. గతంలో రూ.1160 పన్ను చెల్లించాం. ఇప్పుడు ఏకంగా నాలుగు రెట్లు పెంచారు. ఇదేమిటని ప్రశ్నిస్తుంటే సమాధానం ఇవ్వడం లేదు.

- కూనపరెడ్డి వెంకట ధనలక్ష్మి, 12వ వార్డు, పెడన

తప్పులు సవరిస్తాం

ఆస్తి పన్నులు అధికంగా వచ్చాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మున్సిపల్ కార్యాలయంలోని మా ఛాంబర్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాం. ఈ సెల్‌లో ప్రతి రోజూ దరఖాస్తులు తీసుకుంటారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆస్తి పన్నులు సవరిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా పన్నులు విధించారని తేలితే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం.

- మన్నం గోపాలరావు, కమిషనర్

వీఆర్వోలకు స్థాన చలనం

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలంలో పలువురు వీఆర్వోలకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ కార్యాలయ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ 1వ సచివాలయ వీఆర్వో ఏసుపాదం నడుపూరుకు, 2వ సచివాలయ వీఆర్వో ముచ్చు కనకదుర్గను బంటుమిల్లి రోడ్డు సచివాలయానికి, వీఆర్వో మాలతిని కానూరి నగర్ వీవర్స్ కాలనీ నుంచి దాదా గుంట సచివాలయానికి బదిలీ చేశారు. 4వ సచివాలయ వీఆర్వో షాకీరుల్లాను బందరు మండలం కోన గ్రామానికి, 5వ సచివాలయ వీఆర్వో చలమలశెట్టి శ్రీనివాస్‌ను బందరుకోటకు బదిలీచేశారు. 8వ సచివాలయ వీఆర్వో దొడ్డి రత్నకుమారిని 5వ సచివాలయానికి బదిలీ చేశారు. 3వ సచివాలయ వీఆర్వోగా గోపిశెట్టి మధును అరిసేపల్లి నుంచి, 7వ సచివాలయానికి తాళ్లపాలెం నుంచి కుక్కల నాగాంజనేయుల్ని నియమించారు. 8వ సచివాలయ వీఆర్వో పి.శివనాగ సత్యనారాయణను మండలంలోని కమలాపురానికి బదిలీ చేశారు. 8వ సచివాలయానికి చిన్నాపురం నుంచి మట్టా శివనాగమణికంఠను నియమించారు. 9వ సచివాలయ వీఆర్వోను బల్లిపర్రుకు బదిలీ చేశారు. 9వ సచివాలయానికి పల్లెతుమ్మలపాలెం నుంచి మోర్ల శ్రీనివాసరావును నియమించారు.

చౌడు భూముల్లో బీపీటీ వంగడాలు మేలు

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: సముద్ర తీరంలోని చౌడుభూముల్లో బీపీటీ 100, 103 రకం వరి వంగడాలను రైతులు వినియోగించుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్ర రైతులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం వాడపాలెం, సుల్తానగరం గ్రామాల్లో నిర్వహించారు. తొలుత క్షేత్ర సందర్శనలో భాగంగా పొలాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించారు. పైరులో సమస్యలను పరిశీలించారు. ఏఓ హారిక, సర్పంచి మేడిశెట్టి రాజ్‌కుమార్, తెదేపా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కూటమి పెద్దపీట


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, చిత్రంలో వేదవ్యాస్ తదితరులు


బందరు 1వ డివిజన్‌లో 'మంచి ప్రభుత్వం' గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు


బొర్రపోతుపాలెంలో కరపత్రాలు పంచుతున్న తెదేపా నాయకులు

పెడన, పెడన గ్రామీణ, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో పెడన నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకంజ వేసిందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ధ్వజమెత్తారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నడుపూరులో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావేదిక కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్, జడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, జనసేన కన్వీనర్ సురేష్, ఎంపీడీవో రెడ్డియ్య, మండల కూటమి నేతలు శలపాటి ప్రసాద్, వూచా వెంకయ్య, శీరం ప్రసాద్, బొల్లా నాగేశ్వరరావు, సర్పంచి చీర్ల అనూష తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రూ.11 లక్షల ఎన్నార్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు.

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని వివిధ డివిజన్లలో ప్రజావేదిక సభలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో బాబాప్రసాద్, తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్, తెదేపా శిష్టకరణం సాధికారిత సమితి రాష్ట్ర కన్వీనర్ అక్కుమహంతిరాజా, కూటమి నాయకులు బత్తిన దాసు, వంపుగడల చౌదరి, నాలి మాధవ, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, సాతులూరి నాంచారయ్య, వేమూరి రామకృష్ణ, పీవీ ఫణికుమార్ తదితరులు ప్రసంగించారు. నగరపాలక సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలన ఎలా ఉందని నాయకులు ప్రశ్నించగా ప్రజల ప్రభుత్వం, మంచి ప్రభుత్వం అంటూ ముక్త కంఠంతో చెప్పారు. వైకాపా హయాంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో చేసిన మంచి తదితరాలను నాయకులు వివరించారు. పింఛన్ల పెంపు, భూహక్కు చట్టం రద్దు, మెగా డీఎస్సీ తదితర పథకాల గురించి వివరించారు.

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఇది 'మంచి ప్రభుత్వం కార్యక్రమం'లో భాగంగా మంగళవారం బొర్రపోతుపాలెం, బుద్దాలపాలెం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో తెదేపా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తొలి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు కుంచె నాని, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేపీటీ పాలెంలో: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభకు సర్పంచి వడుగు నాగపోతరాజు అధ్యక్షత వహించగా మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే నారాయణప్రసాద్, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: వైద్యాధికారులంతా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు మైలా రత్నకుమారి తదితరులు మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కువగా సీజనల్ వ్యాధులు ఉన్నాయని, వైద్యాధికారులు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. శానిటేషన్, తాగునీరు, వరి పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ మణికంఠ

బంటుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ వెలివెల తారా శశి జ్యోత్స్న కృష్ణ (చిన్నబాబు) అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. గృహనిర్మాణ, నీటిపారుదల, తాగునీరు, ఆరోగ్యం, ఐసీడీఎస్, విద్యుత్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలు వివరించారు. వారి పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, ఇతర పనులను సభలో వివరించారు. ఎంపీడీవో స్వర్ణభారతి, తహసీల్దారు భరత్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఓడిమేచిన్నారి బాబు, కొల్లా లలిత, జడ్పీటీసీ సభ్యురాలు మల్లిశెట్టి వెంకటరమణ, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ బదిలీ

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ బదిలీ అయ్యారు. పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఆయనను సీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

బాలశౌరి కృషితో యాదవ కల్యాణ మండప నిర్మాణం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషితో త్వరలోనే మచిలీపట్నంలో యాదవ కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు యాదవ సంక్షేమ సంఘం నాయకులు, కల్యాణ మండప నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏవీఆర్ రాజు తెలిపారు. మంగళవారం నగరంలోని నాయర్ బడ్డీ సెంటరు ప్రాంతంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా కల్యాణ మండపం పనులు శంకుస్థాపన వరకు రావడం, వివిధ కారణాలతో ఆగిపోవడం జరుగుతోందన్నారు. ఈ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన రూ.1.25కోట్లు కేటాయించేందుకు అంగీకరించడంతో పాటు తొలివిడతగా రూ.50లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథిలతో పాటు ఎంపీ బాలశౌరి చేతులమీదుగా పనులు ప్రారంభించేందుకు సంఘం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కల్యాణ మండప కమిటీ అధ్యక్షుడు గోళ్ల బాబూరావు, ఉపాధ్యక్షుడు కె.కె.చింతయ్య, కోశాధికారి నాగబోయిన రవి తదితరులు మాట్లాడుతూ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: సమగ్రశిక్షా, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, జిల్లా బ్లైండ్‌నెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈవో శేఖర్‌సింగ్, సమగ్రశిక్ష ఐఈ సమన్వయకర్త రాంబాబు మాట్లాడుతూ కలెక్టర్ బాలాజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సమగ్రశిక్షా సీఎంవో రమేష్, ఏపీవో ఏడుకొండలు, ఆప్తాల్మిక్ అధికారులు శ్యామ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. ఎల్వీప్రసాద్ ఆసుపత్రి వైద్యులు కిరణ్, రెబాకా సునందిని తదితరులు పరీక్షలు నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు




కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన గొల్లు కృష్ణ మంగళవారం కలెక్టర్ బాలాజీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు అబ్దుల్ మతీన్, వెలిసెల సుబ్రహ్మణ్యం, కోకా ఫణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

-మచిలీపట్నం (గొడుగుపేట),న్యూస్‌టుడే

శాంతి మార్గంలో సమస్యలకు పరిష్కారం

పెడన, న్యూస్‌టుడే: శాంతి మార్గంలోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మచిలీపట్నం ఆర్డీవో వాణి అన్నారు. పెడనలో ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య వివాదాలు జరిగి రాళ్ల దాడులు చోటుచేసుకున్న నేపథ్యంలో ఇరుపక్షాలతో ఏర్పాటు చేసిన శాంతి కమిటీలతో మంగళవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో సమావేశాన్ని నిర్వహించారు. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు జరగకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. సమావేశంలో మచిలీపట్నం డీఎస్పీ సుభాన్, అల్లర్ల దర్యాప్తునకు నియమించిన సిట్ డీఎస్పీ సుభాష్, రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు పాల్గొన్నారు.

పెదపట్నం దారి.. ప్రమాదకరంగా మారి..


నారాయణపురం - పెదపట్నం మధ్యలో ఇలా..


రోడ్డుపైకి చొచ్చుకొస్తున్న తుమ్మ చెట్లు


నారాయణపురం- పెదపట్నం రోడ్డుపై గుంతలు


దెబ్బతిన్న మార్గమిలా..

న్యూస్‌టుడే, బంటుమిల్లి

బంటుమిల్లి మండలం నారాయణపురం నుంచి బందరు మండలం పెదపట్నం వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా తుమ్మ చెట్లు విపరీతంగా పెరిగాయి. వాటి కొమ్మలు రోడ్లపైకి వాలాయి. దీంతో ఆ దారి వెంబడి రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. తుమ్మ చెట్లు రోడ్డును కమ్మేయడంతో రాత్రివేళ ప్రయాణించే వాహనచోదకులకు అవి దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. కొమ్మలు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు.

రోడ్డు కుంగిపోయి..: ఈ దారిలో మురుగు కాలువపై ఉన్న వంతెన పైకి వెళ్లే రోడ్డు కుంగిపోయింది. దీంతో వేగంగా వచ్చే వాహనచోదకులు రోడ్డు కుంగిపోయిందని విషయం తెలియక అదుపుతప్పి ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నారు. రహదారి వెంబడి పలుచోట్ల రోడ్డు పై గుంతలు పడడంతో పాటు కొంతమేర రోడ్డు దెబ్బతింది. సుమారు 2 కి.మీ మేర ఈ సమస్య అధికంగా ఉంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు, ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

‘గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్



ఉయ్యూరులో కరపత్రాలు అందిస్తూ..

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : గత ప్రభుత్వ హయాంలో నాయకులు ప్రజలను మోసం చేసి వారు ఆర్థికంగా బలోపేతమయ్యారని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆరోపించారు. మండలంలోని ఉప్పులూరులో మంగళవారం నిర్వహించిన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇటీవల వరదలతో సతమతమైన విజయవాడ, శ్రీకాకుళం ప్రాంతాలకు సీఎం చేసిన సేవలపై అవగాహన కల్పించారు.

ఉయ్యూరు, న్యూస్‌టుడే : మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రం అస్తవ్యస్తమైందని, దాన్ని గాడిలో పెట్టే ప్రయత్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్విరామంగా శ్రమిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు నగర పంచాయతీలోని 13వ వార్డులో కౌన్సిలరు పైలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో వైవీబీ పాల్గొని మాట్లాడారు.

వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : వ్యవసాయ, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరంలో రూ.44.74 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్ర భవనాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయడంతో పాటు విక్రయించిన 48 గంటల్లో నగదు జమ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ సౌజన్య, వ్యవసాయాధికారిణి తేజస్వి, ఎంపీడీవో సత్యకుమార్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంతోనే సంక్షోభంలోనూ సంక్షేమం సాధ్యమైందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఉంగుటూరు మండలం ఆముదాలపల్లి, కొయ్యగూరపాడులో నిర్వహించిన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న వెలగపూడి శంకరబాబు తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూలో పశు కొవ్వులను వినియోగించి భక్తుల మనో భావాలను దెబ్బతీసిన వారిని కఠినంగా శిక్షించాలని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, పూర్వ ఈవో ధర్మారెడ్డిలను అరెస్టు చేసి విచారణ చేయాలన్నారు. ఎస్సీ సెల్ నాయకుడు కేంద్ర కోటేశ్వరరావు, ఇమామ్, కొండ, షేక్ సమీర్ పాల్గొన్నారు.

రఘురామరాజుపై చర్యలు తీసుకోండి

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : అంబేడ్కర్‌ను అవమానపర్చేలా వ్యవహరించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. బాధ్యత గల పదవిలో ఉండి అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించిన రఘురామకృష్ణరాజును సస్పెండ్ చేసి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. మంగళవారం స్థానిక కూడలిలో రఘురామ దిష్టి బొమ్మను దహనం చేశారు. ముందుగా ఎన్టీఆర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, ద్విచక్ర వాహన ప్రదర్శన చేపట్టారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాడిగడప సెంటర్‌కు కొత్త కళ

తాడిగడప(కానూరు), న్యూస్‌టుడే

తాడిగడప పురపాలక సంఘంలోని తాడిగడపలోని రెండు వంతెనల మధ్య అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలానే ఈ సెంటర్‌లోనే నగరం తరహాలో ఫుడ్‌కోర్టును రెండు వారాల కిందట ప్రారంభించారు. ఈ రెండు పూర్తిగా అమలైతే నాడు ఈ కూడలి కళ మారిపోయి కొత్త అందాలను సంతరించుకోనుంది.



అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కేటాయించిన స్థలం

తక్కువ ధరకే భోజనం పెట్టాలని..

పురపాలిక మొత్తంలో రెండు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి ప్రజలకు తక్కువ ధరకే ఆహారాన్ని అందించడానికి ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కృషి చేస్తున్నారు. మొదటిది యనమలకుదురు సచివాలయం సమీపంలో కాగా.. తాడిగడప సెంటర్లో మరొకటి ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం రెండు వంతెనల మధ్య ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేశారు.

ఫుడ్ కోర్టు ఏర్పాటు

తాడిగడప కొత్త వంతెన పక్కన రెండు వారాల కిందట స్థానిక ఎమ్మెల్యే ఫుడ్ కోర్టును ప్రారంభించారు. ఇక్కడ నగరం తరహాలో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ రకాల ఆహార పదార్థాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కొన్ని బండ్లు ఏర్పాటు చేశారు. మిగిలినవి కూడా త్వరలో ఏర్పాటు చేసి పూర్తిస్థాయి ఫుడ్ కోర్టును ఏర్పాటు చేయనున్నారు.

వంతెన.. ఇక ఇంతేనా?

కొత్త వారధికి శంకుస్థాపన చేసి 11 ఏళ్లు

కుందేరు(కంకిపాడు), న్యూస్‌టుడే

ఆంగ్లేయుల కాలం నాటి కుందేరు పాత వంతెన 2008లో కూలిపోయింది. దీంతో తాత్కాలికంగా ఇనుప గడ్డర్లతో బెయిలీ వంతెన ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రూ.2.50 కోట్లు అంచనాతో మొదటి శంకుస్థాపన 2013లో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పార్థసారథి చేశారు. సకాలంలో పనులు చేపట్టక పోవడంతో నిధులన్నీ మురిగిపోయాయి. తర్వాత రూ.6.50 కోట్లు(దీనిలో రహదారి లనూ కలిపారు)నిధులు తిరిగి మంజూరు చేయించిన 2015లో మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ రెండో సారి శంకుస్థాపన చేశారు. పెనమలూరు, గన్నవరం, పామర్రు నియోజకవర్గాలకు చెందిన సుమారు 50 వేల మందికి ఉపయోగపడే ఈ వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఇలా..



బెయిలీ వంతెనపై బోల్తా పడిన ట్రాక్టర్ (పాత చిత్రం)

ఫలితం సూన్యం...

వివాదాస్పద 12 సెంట్ల స్థలంపై నిర్వాసితులకు అనుకూలంగా న్యాయస్థానం తీర్పు, పునరావాసం, నష్టపరిహారం చెల్లింపు, ఎలైన్‌మెంట్ మార్పారనే ఆరోపణలతో రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేపట్టడం విదితమే. ఇప్పటికీ వివాదం పరిష్కారం కాలేదు. రెవెన్యూ, జల వనరుల శాఖల మధ్య సమన్వయ లోపం. ఆరు నెలల్లో విధమైన నిర్ణయాలు తీసుకోవడమే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. కలెక్టర్లు, జేసీలు, సబ్ కలెక్టర్లు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, ఈఈ, డీఈఈ. వందకు పైగా పర్యాయాలు వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. అయినా ఫలితం కనిపించలేదు. శిథిలమైన బెయిలీ వంతెనపై జరిగిన పలు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా, క్షతగాత్రుల సంఖ్య సుమారు వందకు పైగా ఉంది. ధ్వంసమైన వాహనాలు దాదాపు రెండు వందలు కాగా.. పది పశువులు మృత్యువాత పడ్డాయి.

ఆశించిన వారికి నిరాశే..

కుందేరు కందలంపాడు, మానికొండ, ఆకునూరు, నెప్పల్లి, తరిగొప్పల, మారేడుమాక, కోలవెన్ను పరిసర ప్రాంతాల ప్రయాణికులు, ప్రధానంగా రైతులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దయ్యి పదేళ్లయింది. నిర్మాణ వ్యయం గణనీయంగా పెరగడంతో దీన్ని పూర్తి చేయడానికి సుమారు రూ.2 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. నిధులు లేవని రోడ్లు భవనాల శాఖ సైతం చేతులెత్తేసింది. ఐదేళ్ల వైకాపా పాలనలో ఒక్క రూపాయి పని కూడా చేయలేదు. గత వేసవిలో పనులు తిరిగి ప్రారంభిస్తారని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది.

మరమ్మతులకే రూ.30 లక్షలు

ఇనుప వంతెన మరమ్మతులకే గత 15 ఏళ్లలో కనీసం రూ.30 లక్షలు ఖర్చు పెట్టి ఉంటారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో దీన్ని పూర్తి స్థాయిలో బాగు చేయలేదు. ఎప్పటికపుడు ఐదారు రేకులను తొలగిస్తూ నామమాత్రపు పనులే చేస్తున్నారు.

- వెలగపూడి ఆజాద్, మాజీ సర్పంచి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం..

గతంలో రాజకీయ, పునరావాస వివాదాలతో కొత్త వంతెన నిర్మాణం మధ్యలోనే ఆగింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాం. దీని కోసమే కృషి చేస్తున్నామని, రెండు, మూడు నెలల్లో పనులు తిరిగి ప్రారంభమవుతాయని ఆయన హామీ ఇచ్చారు.

-చలసాని వెంకటేశ్వరరావు, రైతు

పారిశుద్ధ్యం అధ్వానం.. అపరిశుభ్రం

న్యూస్‌టుడే, ప్రసాదంపాడు

ప్రసాదంపాడులో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బల్లెం వారి వీధి, సాయి బాబా ఆలయం వీధి, సెయింట్ ఆన్స్ స్కూల్ తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య కార్మికులు వీటిని తొలగించకుండా రోజుల తరబడి అలానే వదిలేయడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులతో పాటు అటుగా రాకపోకలు సాగించేవారు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు నెలల తరబడి మురుగు కాలువల్లో పూడిక తీయక పోవడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఫలితంగా దోమల వృద్ధి విపరీతంగా పెరిగిపోయింది. ఇప్పటికైన పంచాయితీ అధికారులు స్పందించి కాలువల్లో పేరుకున్న చెత్త తొలగించడంతో పాటు రహదారి పక్కన వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బల్లెంవారి వీధిలో గుట్టగా పోసిన వ్యర్థాలు

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



రిబ్బన్ కత్తిరిస్తున్న ఎంపీపీ, ఎంఈవో



విజేత జట్టుతో వ్యాయామోపాధ్యాయులు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బాపులపాడు జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా 14, 17 ఏళ్ల పురుషులకు పలు పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లతో నియోజకవర్గ పోటీల్లో పాల్గొనే జట్లను ఎంపిక చేసినట్లు మండల క్రీడ సమన్వయకర్త పామర్తి కోటేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ నగేష్, ఎంఈవో శ్రీరామబాబా సింగ్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో గత రెండ్రోజులుగా జరుగుతున్న అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విజేతలను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేసినట్లు క్రీడా సమాఖ్య ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ తెలిపారు. పలువురు వ్యాయామోపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సేవ చేయాలి

కానూరు, న్యూస్‌టుడే : ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక సేవ చేయాలని వీఆర్ సిద్ధార్థ విశ్వవిద్యాలయం ఉప కులపతి పి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెస్టు ఎన్ఎస్ఎస్ వాలంటీరుగా ఎంపికైన దయాల అవినాష్‌కు అవార్డు అందించారు. ప్రిన్సిపల్ రత్నప్రసాదు, కొల్లా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అవినాష్‌కు అవార్డు అందిస్తున్న ఉప కులపతి వెంకటేశ్వరరావు

గ్రామ సభలో ఆందోళన

పెనమలూరు, న్యూస్‌టుడే : చోడవరంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్థులు ఆందోళన చేశారు. తాగునీటి ట్యాంకును రెండు నెలల నుంచి శుభ్రపర్చడం లేదని, మంచినీటిలో నాచు, నలకలు తాండవిస్తున్నాయంటూ పలువురు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శి ప్రసాద్ చుట్టపు చూపుగా కార్యాలయానికి వచ్చిపోతుండటంతో సమస్యలను ప్రస్తావించడానికి కూడా అవకాశం లేకుండా పోతోందంటూ వాపోయారు. పారిశుద్ధ్య పనుల కాంట్రాక్టరు గైర్హాజరైన కార్మికులకు కూడా జీతాలు నమోదు చేసుకొని స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత రికార్డు పంచాయతీ కార్యాలయంలో కాకుండా తన ఇంటి వద్దకు తీసుకెళ్లి ఇష్టానుసారంగా కార్మికులకు హాజరు నమోదు చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం

ఉయ్యూరు, న్యూస్‌టుడే : తాండవ లక్ష్మి ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మాదాసు శ్రీనివాసరావు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 వేలు అందించారు. దీనికి సంబంధించిన చెక్కును సీఎం చంద్రబాబుకు మంగళవారం ఉండవల్లిలో అందించారు.

నిర్మాణ పనుల పరిశీలన

కానూరు, న్యూస్‌టుడే : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో పైవంతెన కింద జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బోడే ప్రసాదు మంగళవారం పరిశీలించారు.

ప్రజా సమస్యలకు ప్రాధాన్యం

పెనమలూరు, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అందరికీ అందుబాటులో ఉండాలని తాడిగడప పురపాలక సంఘం నూతన కమిషనర్ భవానీ ప్రసాద్‌కు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యేను తన కార్యాలయంలో కమిషనర్ మంగళవారం కలిశారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తాం

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే : తాడిగడప పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా బదిలీపై వచ్చిన భవానీప్రసాద్ పోరంకి కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పురపాలికలోని అన్ని సచివాలయాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం చేస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉప్పులూరు, మంతెన, తెన్నేరు గ్రామాల వరద బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నిత్యావసరాలను ఆయన మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో ఎటువంటి పూడికతీతల పనులు చేపట్టకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని ఆరోపించారు. వరద బాధితులతో పాటు పంట నష్టపోయిన రైతులకు మేలు చేకూరే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ముదునూరు విద్యుత్తు ఉప కేంద్రంలో 11 కేవీ సాయిపురం ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ముదునూరు, జబర్లపూడి, సాయిపురం, బోళ్లపాడు గ్రామాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు సరఫరా చేసే విద్యుత్తును నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి. కృష్ణానాయక్ మంగళవారం తెలిపారు.

పేరంటాలమ్మ ఆలయ ఈవోగా ప్రియాంక

రామవరప్పాడు, న్యూస్‌టుడే : స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారిగా ప్రియాంకను నియమించారు. ఆమె ఇప్పటి వరకు తూర్పు గోదావరి జిల్లాలోని రంగాపేట ఆలయంలో పని చేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన పి.లోకేశ్వరి మాచవరం దాసాంజనేయ స్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా బదిలీ అయ్యారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : కనుమోలు ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గోదరేజ్ ఆగ్రో కర్మాగారంలో వైద్య శిబిరం నిర్వహించారు. వీరవల్లి పీహెచ్‌సీ వైద్యులు కిరణ్మయి, ప్రణయ్‌సాగర్, సీహెచ్‌వో నాజ్‌మున్ పర్వీన్ సారథ్యంలో వైద్య సిబ్బంది పలువురు కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.


ప్రముఖ వైద్యుడి మృతి

హనుమాన్ జంక్షన్ : హనుమాన్ జంక్షన్‌లో పాత తరం వైద్యుల్లో ఒకరిగా గుర్తింపు పొందిన గోగినేని బాస్కరరావు(87) అనారోగ్యంతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కొనకళ్లకు అభినందన

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను బాపులపాడు మండలానికి చెందిన పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. చింతల వెంకట శివ అప్పారావు, వేగిరెడ్డి బాలాజీ తదితరులు మచిలీటప్నంలోని కొనకళ్ల నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.

పెనమలూరు: మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు ఆర్టీసీ ఛైర్మన్ పదవి ఇవ్వడంపై కృష్ణాజిల్లా బీసీ, గౌడాధికార సంఘ కన్వీనర్ శొంఠి శివరాం ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. తెదేపాలో బీసీలకు ప్రాధాన్యం ఉంటుందని మరోసారి రుజువైందని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.



నారాయణను సన్మానిస్తున్న నాయకులు

గోడ పత్రికలు ఆవిష్కరణ

హనుమాన్ జంక్షన్: ఈ నెల 25న ప్రారంభమయ్యే పాఠశాల, మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని స్రవంతి ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్య ప్రసాద్ తెలిపారు. మంగళవారం హనుమాన్ జంక్షన్‌లో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు.

చోరుడి అరెస్టు

పెనమలూరు, న్యూస్‌టుడే : పలు చోరీ కేసుల్లో నిందితుడిని స్థానిక పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వివరాల ప్రకారం.. పోరంకిలోని ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో ఈ నెల 18న దొంగతనం జరగ్గా దుకాణదారుడు రమేష్‌కుమార్ పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చోరీ చేసింది కైకలూరు మండలం అటపాకకు చెందిన ఆరేపల్లి దుర్గారావుగా గుర్తించి, అరెస్టు చేశారు. అతడ్ని విచారించగా ఈ నెల 14న గుంటూరులోని ఓ జ్యువెలరీ దుకాణం, 15న గన్నవరంలోని రంగుల దుకాణం, మంగళగిరిలోని ఓ ఆటో మొబైల్ దుకాణం, 17న విజయవాడ ప్రభుత్వాసుపత్రి సమీపంలో, 18న గుంటూరు కొత్తపేటలోని ఎయిర్‌టెల్ దుకాణాల్లో చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని న్యాయస్థానంలో హాజరు పరిచారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు నిచ్చారు. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన దండమూడి అజయ్‌కుమార్ 2018 ఫిబ్రవరిలో రూ.2.50 లక్షలను కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన పలగాని విజయ్‌కుమార్‌కు అప్పుగా ఇచ్చారు. బాకీ చెల్లించమని కోరగా విజయ్‌కుమార్ రూ.2.75 లక్షలకు చెక్కు ఇచ్చారు. దాన్ని సంబంధిత బ్యాంకులో ఇవ్వగా ఖాతాలో నగదు లేదని తెలియడంతో అజయ్‌కుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెలువరించారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి..

పెనమలూరు, న్యూస్‌టుడే : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి న్యాయస్థానం రూ.10 వేలు జరిమానా విధించింది. ఈ నెల 22న గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్, పెనమలూరు ఎస్సై ఫిరోజ్ తాడిగడప కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కంకిపాడుకు చెందిన పాతూరి ప్రవీణ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించి, బ్రీత్ అనలైజింగ్ పరీక్ష చేయగా అతిగా మద్యం తాగినట్లు గుర్తించారు. దీంతో అతడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయాధికారి రూ.పది వేలు జరిమానా విధించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? మల్లాయపాలెం పంచాయతీ బంటుమిల్లి రోడ్డులోని అలంకృత పంక్షన్ హాలుకు ఎదురుగా వీధి దీపాలు వెలగడం లేదు. **- వీరమాచనేని విజయలక్ష్మి, బంటుమిల్లి రోడ్డు**

✔ మల్లాయపాలెం గుడివాడ పురపాలక సంఘంలో విలీనం కానుంది. పురపాలక అధికారులు రుసుము చెల్లించిన వెంటనే దీపాలు ఏర్పాటు చేస్తాం. **- కె.ఉష, విద్యుత్తు శాఖ ఏఈ**



దీపాలు లేని స్తంభం

? మల్లాయపాలెంలో బంటుమిల్లి రోడ్డుకు రెండు వైపులా చెత్త, కొబ్బరి బొండాలు, కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. దోమలు పెరుగుతున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. **- వి.రాయ్, బంటుమిల్లి రోడ్డు**

✔ కోడి మాంసం వ్యాపారులపై చరిత చర్యలు తీసుకుంటాం. బాలకృష్ణానగర్‌లో చెత్త ఇప్పటికే తొలగించాం. **- హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, మల్లాయపాలెం.**

విధుల్లో చేరిన ఘంటసాల ఎంపీడీవో



సుబ్బారావు

ఘంటసాల,న్యూస్‌టుడే: ఘంటసాల ఎంపీడీవో డి.సుబ్బారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గూడూరు మండల ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఘంటసాలకు వచ్చారు. ఎంపీడీవో సుబ్బారావును ఏవో శ్రీనివాస చందు, ఈవోపీఆర్డీ కిషోర్, మండల పరిషత్ సిబ్బంది స్వాగతం పలికారు.

ఎమ్మెల్యే చొరవతో కరకట్టపై జంగిల్ తొలగింపు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే చొరవతో స్థానిక ఎడ్లంక రహదారి వద్ద నుంచి బందలాయిచెరువు వైపు కరకట్టపై జంగిల్ తొలగింపు చర్యలు మంగళవారం చేపట్టారు. కరకట్టపై ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి పోవడంతో పాదచారులు, ద్విచక్రవాహనాలు కూడా వెళ్ల లేని పరిస్థితి నెలకొంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవ తీసుకుని మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జంగిల్ తొలగించారు.

కొండలమ్మ దేవస్థానం ఈవో బాధ్యతల స్వీకరణ

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వేమవరం కొండలమ్మ దేవస్థానం నూతన ఈవోగా ఆకుల కొండలరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడెం గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయ ఈవోగా వ్యవహరిస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఆశయానికి తూట్లు.. పంచాయతీలకు పాట్లు

న్యూస్‌టుడే, నాగాయలంక



మర్రిపాలెంలో వినియోగించక ఇలా..

చెత్త నుంచి ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలనే ఉదాత్తమైన లక్ష్యం గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పక్కదారి పట్టింది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు అయిదేళ్లుగా ఉత్సవ విగ్రహాలను తలపిం చాయి. తడి, పొడి చెత్త సంపద సృష్టి ఉపయోగించి ఎరువు తయారీకి అనుగుణంగా చేసిన ఏర్పాట్లు నిరుపయోగంగా మారాయి. నాగాయలంక మండలంలో 22 పంచాయతీల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ నాగాయలంక, భావదేవరపల్లిలో మినహా మరెక్కడా ఎరువు తయారీ ప్రారంభం కాలేదు. చెత్తపై పన్ను వసూలు చేసిన జగన్ ప్రభుత్వం స్వచ్ఛతను మరిచింది. గ్రామాల్లో అంతర్గత రహదారులు, మురుగు, పంట కాల్వల్లో ఎక్కడ చూసినా చెత్తతో నిండి ఉన్నాయి. ☛ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా వాటిని వినియోగించక పోవడంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. నాగాయలంకలో తప్ప మిగిలిన గ్రామాల్లో చెత్త రోడ్ల పక్కన, కాల్వ గట్లపై పారబోస్తున్నారు. దీంతో కాలుష్యం పెరిగి గ్రామస్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పలు గ్రామాల్లో అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

వినియోగంలోకి తేవాలి..

ఎంతో ఉన్నతమైన ఈ ఆశయాన్ని ఒడిసి పట్టుకుంటే పంచాయతీలకు ఆదాయం పెరుగుతుంది. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. తడి, పొడి చెత్త వేరు చేసి వానపాముల ఎరువు తయారీ చేయించేలా కృషి చేయాలి. **- నాగాయలంక ప్రజలు**

అందుబాటులోకి తెస్తాం..

సంపద సృష్టి కేంద్రాలను అక్టోబరు నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీలకు ఆదాయం సమకూర్చే దిశగా నిర్వహణలో మార్పులు తీసుకొస్తాం. **- అప్పలనరసమ్మ, ఈఓపీఆర్డీ, నాగాయలంక**

అసాంఘిక శక్తులకు అడ్డాగా..

న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం

గుడివాడ మండలంలోని సంపద సృష్టి కేంద్రాలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. మొత్తం 21 పంచాయతీలకు గానూ 20 కేంద్రాలు నిర్మించారు. వాటిలో దొండపాడు, తటివర్రు, రామనపూడిలో మాత్రమే సక్రమంగా పనిచేస్తున్నాయి. మిగిలిన చోట్ల తాగుబోతులు, జూదరులు, జులాయిగా తిరిగే వారికి ఆవాసాలుగా మారాయి. మోటూరులో రైల్వే గేటు వద్ద ఉన్న కేంద్రం నిత్యం తాగుబోతులతో కిటకిటలాడుతోంది. బొమ్ములూరులోని సంపద కేంద్రంలో పరస్పరం దాడులకు పాల్పడి బీరుసీసాతో ఒకరిపై దాడి చేసి ఇటీవలే చంపేశారు. ప్రతి ఇంటికీ చెత్త బుట్టలు పంపిణీ చేసినప్పటికీ గ్రీన్ అంబాసిడర్లు, ఆటోలు ఎక్కడా కనిపించడం లేదు. చాలా గ్రామాల్లో రక్షణ లేక వాహనాలు పాడవుతున్నాయి.



దొండపాడులోని సంపద తయారీ కేంద్రం

కొనకళ్ల నియామకంపై హర్షం



నారాయణరావును సత్కరిస్తున్న తెదేపా మహిళా విభాగం

కూచిపూడి, మోపిదేవి, నాగాయలంక, చల్లపల్లి, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుకు ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించడంతో తెదేపా మహిళా విభాగం బందరులో ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపింది. మోపిదేవి, అవనిగడ్డ మాజీ ఎంపీపీలు మోర్ల జయలక్ష్మి, బండే కనకదుర్గ, చల్లపల్లి సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. ✤ కొనకళ్ల త్యాగానికి గుర్తింపుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్‌గా తగిన ప్రాధాన్యత ఇచ్చినందుకు నాగాయలంక కూటమి శ్రేణులు హర్షించారు. తెదేపా జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, తెదేపా బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్, నాగాయలంక మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు తదితరులు కొనకళ్లకు అభినందనలు తెలిపారు. ✤ కొనకళ్ల నారాయణరావు ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించడంపై మొవ్వ మండల తెదేపా, బీసీ సంఘ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, తెదేపా నాయకులు తదితరులు కొనకళ్లకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వానికి సహకరించండి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పమిడిముక్కల,న్యూస్‌టుడే: కపట హామీలు, స్వార్థ ఆలోచనలతో రాష్ట్రాన్ని కడగండ్లపాలు చేసిన గత రాచరిక ప్రభుత్వం కంటే పదవి చేపట్టిన వంద రోజుల్లోనే ప్రజలకు బాసటగా నిలిచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తున్న ఈ మంచి ప్రభుత్వానికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కోరారు. పమిడిముక్కలలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో సాగుతున్న కూటమి ప్రభుత్వం ఎందుకు మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందో వివరించారు. సర్పంచి ముళ్లపూడి సునీత, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాడిశెట్టి నరేష్, తెదేపా మండలాధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, ఎంపీడీవో విఠల్‌పాల్, తహసీల్దారు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నాయకుల పరామర్శ

మోపిదేవి, న్యూస్‌టుడే: కూటమి కార్యకర్తలపై వైకాపా మూకలు దాడులు చేస్తే తగిన ప్రతిఫలం ఉంటుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరించారు. పోచిగానిలంకలో ఇటీవల గణేష్ నిమజ్జనం గ్రామోత్సవం సందర్భంగా జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోర్ల వెంకటస్వామి, సాయిరాం, వెంకమ్మలను పరామర్శించి దాడికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

వరద బాధితులకు విరాళాలు



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఉదయ్‌కుమార్

చల్లపల్లి, న్యూస్‌టుడే: మంగళాపురం కేంద్రంగా రావెళ్ల ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రావెళ్ల ఉదయ్‌కుమార్ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం రూ.లక్ష విరాళం అందించారు. బత్తిన రాజేష్‌బాబు, కిలారు సోమశేఖర్, కాకర్లపూడి తేజారాజు పాల్గొన్నారు.

రూ.50 వేలు ఇచ్చిన డ్వాక్రా సభ్యులు

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు మండలం కురుమద్దాలికి చెందిన డ్వాక్రా సంఘ సభ్యులు వరద బాధితుల సహాయార్థం రూ.50వేలు నగదును మంగళవారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అదేవిధంగా పెదపారుపూడి మండలం యలమర్రుకి చెందిన సుంకర శ్రీధర్ రూ.20వేలు నగదును ఎమ్మెల్యేకు అందించారు.

తెదేపా ఆధ్వర్యంలో ఎండుగడ్డి వితరణ

వెణుతురుమిల్లి(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: నందివాడ వరద ప్రాంత రైతులకు పశుగ్రాసం కోసం వెణుతురుమిల్లి తెదేపా నాయకులు 5 ఎకరాల ఎండుగడ్డిని వితరణగా పంపారు. కొప్పినేని పిచ్చేశ్వరరావు, కాగిత హరిబాబు, పాగోలు అనిల్‌కుమార్, కొప్పినేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలకు పదేళ్లపాటు స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉప కులపతి ఆచార్య డాక్టర్ కేవీఎస్‌జీ.మురళీ కృష్ణ మంగళవారం ఇంజినీరింగ్ కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు, అత్యాధునిక ప్రయోగ శాలలతో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు ఈ హోదా లభించిందన్నారు. కళాశాల డైరెక్టర్ బి.కల్యాణ్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌హెచ్‌వీ.ప్రసాదరావు పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయం ఆదాయం రూ.4.2 లక్షలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలు రూ.4.20లక్షలు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద్ మంగళవారం తెలిపారు.

వైద్య సెలవులో గుడ్లవల్లేరు ఎంపీడీవో

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: గుడ్లవల్లేరు ఎంపీడీవో కృష్ణవేణి బుధవారం నుంచి 3 నెలల పాటు వైద్య సెలవులోకి వెళ్లిపోయారు. మంగళవారం సాయంత్రం ఈ మేరకు జీడ్పీ సీఈవోకు దరఖాస్తు అందజేశారు. 50 రోజుల కిందట ఆమె ఇక్కడ విధుల్లో చేరారు. ప్రస్తుత బదిలీల నేపథ్యంలో ఏలూరు జిల్లా ముదినేపల్లి ఎంపీడీవో ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపారు. ఈ మేరకు రాజకీయ లాబీయింగ్ జరగడంతో ఆవేదనకు గురైన ఆమె 3 నెలల పాటు వైద్య సెలవులోకి వెళ్లిపోయారు. కృష్ణవేణి తెలంగాణ రాష్ట్ర న్యాయ విభాగం నుంచి ఇక్కడికి వచ్చారు. తనకు న్యాయ విభాగంలోనే విధులు కేటాయించాలని ఉన్నతాధికారులను కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు.

11 ఏళ్ల తర్వాత డీటీకి స్థానచలనం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: ఉప తహసీల్దార్ కనకదుర్గ ఘంటసాల డీటీగా బదిలీ అయ్యారు. 11 ఏళ్లుగా ఆమె ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గానూ వ్యవహరిస్తున్నారు. గుడివాడ ఎన్నికల విభాగం డీటీ లోకరాజును ఇక్కడికి బదిలీ చేశారు.

సూపర్ స్టార్ విగ్రహం ఏర్పాటు చేయాలి



కృష్ణ అభిమాన సంఘ నాయకులతో ఎమ్మెల్యే రాము

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: సూపర్ స్టార్ కృష్ణ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును అభిమానులు కోరారు. కృష్ణ అభిమానులు ఎమ్మెల్యే రామును తన నివాసంలో మంగళవారం కలిశారు. అడుసుమిల్లి రాజేంద్రప్రసాద్, మహదేవన్, కొల్లిపర సాయి సుబ్రమణ్యం, పాలడుగు రాంబాబు, శ్రీనివాస్, పొట్ల శ్రీను, మహేష్ బాబు అభిమానసంఘాల అధ్యక్షుడు శివాజి తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా



అరకొరగా హాజరు.. ఖాళీగా కుర్చీలు

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో చేపట్టే అభివృద్ధి పనులపై తమకు సమాచారం లేదు.. సర్వసభ్య సమావేశానికి మేము రామంటూ ఎంపీటీసీ సభ్యులు ఇంటిదారి పట్టారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు అవనిగడ్డ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఎంపీపీతోపాటు వైకాపా ఎంపీటీసీ సభ్యుల వ్యవహార తీరుతో సమావేశం నిర్వహణకు నోచుకోలేదు. అంతకు ముందు పాలవర్గం మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని వైకాపా ఎంపీటీసీ సభ్యులు వేడుకలు చేసుకున్నారు. కానీ సర్వసభ్య సమావేశం విషయంలో మాత్రం గోశాలల ఏర్పాటు, సీసీ రోడ్ల అనుమతులు తదితర అంశాలు తమకు తెలీదని చెబుతూ వెళ్లిపోయారు. దీంతో సమావేశానికి కోరం లేనందున వాయిదా వేశామని ఎంపీడీవో మరియాదేవి తెలిపారు.

మండల పరిషత్తు కార్యాలయంలో వేడుకలు

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు మండల పరిషత్ పాలకవర్గం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ అశోక్‌కుమార్ సభ్యులతో కలిసి కేక్ కోసి పంచారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీడీవో రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: విశ్వనాథపల్లిలో వివాహిత ఆత్మహత్య చేసుకుందని ఎస్సై శిరీష తెలిపారు. కుటుంబ గొడవల నేపథ్యంలో ఈ నెల 22న గ్రామానికి చెందిన మారుబోయిన రోజా (31) పురుగుల మందు తాగింది. వెంటనే గుర్తించి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు ఎస్సై చెప్పారు. తల్లి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట నష్టం నమోదు చేయడంలేదని ఆవేదన



నష్టపోయిన పంటను చూపిస్తున్న కౌలు రైతు

కోసూరుపాలెం (మోపిదేవి), న్యూస్‌టుడే: వరద ఉద్ధృతికి మూడు ఎకరాల మొక్కజొన్న పంట నష్టపోయినా జాబితాలో నమోదు చేయలేదని కౌలు రైతు కోసూరు వేణుగోపాల్ మంగళవారం ఆరోపించారు. వరద ముంపునకు గురై నష్టపోయిన విషయాన్ని ఈనెల 11న ఆర్బీకేలో తెలిపారు. మొక్కజొన్న నష్టం నమోదు చేయడం లేదని దురుసుగా సమాధానం చెప్పారన్నారు. సీఎం ప్రకటన చూసి రెండోసారి ఆర్బీకేకు వెళ్లగా నమోదుకు గడువు అయిపోయిందని, సైట్ మూసివేశారని చెపారని.. రూ.4 లక్షల పెట్టుబడి అయిందని విలేకర్ల ఎదుట వాపోయారు.

రైతులను ఆదుకోవాలి

కూచిపూడి, న్యూస్‌టుడే: వరదల్లో నష్టపోయిన రైతు, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలురైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. మొవ్వ తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ వరికి ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నాయకులు కరుణాకర్, సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం, వడ్డి వెంకటేశ్వరరావు, పంది సుబ్బారావు, పాండవులు తదితరులు పాల్గొన్నారు.

'రిజర్వేషన్లు తొలగిస్తామనడం దారుణం'



ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఓబీసీ మోర్చా సభ్యులు

పామర్రు, న్యూస్‌టుడే: అమెరికాలో రిజర్వేషన్లపై రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తాననడం దారుణమని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలన అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో పాల్గొని ఆయన మాట్లాడారు. కొన్ని రాష్ట్రాల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడం అవసరం లేదని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. దేశానికి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలన్నారు. ఓబీసీ రాష్ట్ర కోశాధికారి ఆర్.కె.పట్నాయక్, నియోజకవర్గ కో-కన్వీనర్ కొల్లూరి రమేష్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి నాగేశ్వరరావు, నరసింహ, యార్లగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన



గ్యాస్ ప్రమాదాలపై వివరిస్తున్న అగ్నిమాపక అధికారి ప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ.వీరకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి పి.ప్రసాద్ గ్యాస్ సిలిండర్ల వినియోగంపై జాగ్రత్తలు ప్రయోగాత్మకంగా వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ శేషగిరిరావు, ప్రిన్సిపల్స్ ఉమారాణి, రేఖారాణి ఎల్ఎఫ్ బాలమురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌రహిత సమాజం మనందరి లక్ష్యం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వాడకమే పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణమని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఏఎన్నార్ కళాశాలలో మంగళవారం మొక్కలు నాటారు. కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ కేఎస్.అప్పారావు, పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్‌కే.ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ బీఎస్ఎస్.పద్మజ, ఎన్ఎస్ఎస్ అధికారి ఎం.జేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతకు సామాజిక బాధ్యత అవశ్యం

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: నేటి యువత విద్యతోపాటు సామాజిక బాధ్యత తప్పక కలిగి ఉండాలని ప్రముఖ దంత వైద్యుడు, భాగ్యవిధాత ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ బండారు శ్యాంకుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వీవీపార్మసీ కళాశాలలో నిర్వహించిన జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్యాంకుమార్‌ను ప్రిన్సిపల్ ఎ.లక్ష్మణరావు, సూపరింటెండెంట్ గద్దె సోమరాజు, అధ్యాపకులు అమీనాబీ, ప్రశాంతి, సత్యశ్రీ తదితరులు సత్కరించారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



చిన్నారులతో రోటరీ ప్రతినిధులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రోటరీ యువజనోత్సవాల సందర్భంగా స్థానిక జీవీ పూర్ణచంద్రరావు సామాజిక హాల్‌లో మంగళవారం నిర్వహించిన సంప్రదాయి నృత్య పోటీలు ఆద్యంతం అలరించాయి. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన జానపద, శాస్త్రీయ నృత్య పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ఇంటి స్వామిదాసు, బంగారు బాబు వ్యహరించారు. డైరెక్టర్ వై.రెడ్డియ్య చౌదరి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు టీఎన్.రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్ బాబు, పూర్వాధ్యక్షుడు పి.రామకృష్ణ, డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, ఎ.సుబ్రమణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనవారితో పీడీ, పీఈటీలు

కోసూరు (కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం కోసూరు జడ్పీ పాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పామర్రు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అండర్ 14, 17 బాల, బాలికల విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా విభాగాల నుంచి ఎంపిక చేశారు. మండల క్రీడా పోటీల ఇన్‌ఛార్జి కె.కె.ఎం.చందు, ఎంపీటీసీ సభ్యురాలు డొక్కు భూలక్ష్మి, ఎంఈవో శ్రీలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ గొరిపర్తి శ్రీలత, పాఠశాల హెచ్ఎం బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు

చురుగ్గా భాజపా సభ్యత్వ నమోదు



బర్రంకుల గ్రామంలో నాయకులు

నాగాయలంక, న్యూస్‌టుడే: అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో భాజపా జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, జిల్లా ఇన్‌ఛార్జి ఉన్నపట్ల కబర్ధి, సూరే లక్ష్మీ నారాయణ (గాంధీ) మంగళవారం పర్యటించారు. మండల అధ్యక్షుడు కన్నా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గణపేశ్వరం, దీనదయాళ్‌పురం, బర్రంకుల గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళీకృష్ణ, కార్యదర్శి దొండపాటి శ్రీనివాసరావు, కార్యక్రమ ఇన్‌ఛార్జి చన్నగిరి లతామోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి ఉప సర్పంచి ముమ్మనేని నాని పుట్టినరోజు సందర్భంగా ఆయన విద్యార్థులకు సాయం అందించారు. బీటెక్ చదువుతున్న జన్ను వరుణ్‌కుమార్‌కు ల్యాప్‌టాప్, నిహారికకు విద్య కోసం రూ. 10వేల నగదును ఎస్సై సుబ్రహ్మణ్యం, సీఐ ఈశ్వరరావు ద్వారా అందజేశారు.

పాఠశాలకు బీరువాలు అందజేత

నాగాయలంక, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాలకు రీజనల్ ఇంజినీరింగ్ కాలేజీ(వరంగల్)కు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్ సబ్బినేని వెంకటేశ్వరరావు రూ.30 వేలు విలువగల రెండు బీరువాలను మంగళవారం దాత మేనల్లుడు శివాజీ పాఠశాల విద్యా కుటుంబానికి అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పీఎన్‌వి ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

కప్తాన్‌పాలెం (మోపిదేవి), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై కప్తాన్‌పాలెం సాయిబాబా దేవాలయం ఎదురుగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదప్రోలుకి చెందిన మండవ రాధాకృష్ణమూర్తి తీవ్రంగా గాయ పడినట్లు స్థానికులు తెలిపారు. పొలం నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా కారు ఢీ కొట్టినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. 108 వాహనంలో తరలించి బందరు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

దర్శకుడు కొరటాల శివ నుంచి వచ్చేవన్నీ కమర్షియల్ చిత్రాలే అయినా అంతర్లీనంగా బలమైన సందేశాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. కుటుంబం, సమాజం, ప్రకృతి.. ఇలా ఏదోక దాని విషయంలో బాధ్యతల్ని గుర్తు చేస్తుంటాయి. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' లాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇప్పుడాయన కథానాయకుడు ఎన్టీఆర్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్ర తొలి భాగం 'దేవర పార్ట్ 1' పేరుతో ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు కొరటాల శివ.


కొరటాల శివ

మనిషిని సరైన దారిలో నడిపించేది భయమే!

అందరూ ధైర్యాన్ని సానుకూలంగా.. భయాన్ని నెగెటివ్‌గా చూస్తుంటారు. కానీ, 'దేవర'లో భయాన్ని ఎందుకు చూపించనున్నారు?

"మనిషికి ధైర్యం అవసరమే కానీ మితిమీరిన ధైర్యం మంచిది కాదు. అది మూర్ఖత్వానికి.. విధ్వంసానికి కారణమవుతుంది. అందుకే మనలో ఉన్న భయాన్ని గౌరవించాలి. అది అందరికీ మంచిది. ఎవరైనా భయం ఉండకూడదని చెబితే అది చాలా తప్పు. ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఎవరైనా ఆగుతారంటే ఓ భయం వల్లే. లేదంటే ఎవరూ ఆగరు. భయమే మనిషిని సరైన దారిలో నడిపిస్తుందని నమ్ముతా. దీన్నే 'దేవర'లో చాలా గట్టిగా చెప్పా".

'ఆచార్య' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"నేను జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటాను. ఏదైనా టీమ్ ఎఫర్టే. అన్నీ నాకే తెలుసని నేనెప్పుడూ అనుకోను. ఇక కథ పరంగా అంటే దీని విషయంలో చాలా జాగ్రత్తలే తీసుకున్నా. మనం ఒక పరీక్ష బాగా రాయకపోతే దాని తర్వాత పరీక్ష కచ్చితంగా బాగా రాయాలనుకుంటాం కదా. ఇదీ అంతే. 'ఆచార్య' విడుదలైన 20రోజుల్లోపే నేను ఈ చిత్ర పనుల్లో బిజీ అయిపోయాను. అందుకే ఆ ఫలితం నాపై మరీ అంతగా ప్రభావం చూపలేదు".

ప్రస్తుతం మీకు చిరంజీవికి మధ్య అనుబంధం ఎలా ఉంది?

"మా అనుబంధం ఎప్పుడూ మంచిగానే ఉంటుంది. 'ఆచార్య' విడుదలయ్యాక నాకు మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. 'నువ్వు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలి. చాలా గట్టిగా కొట్టాలి' అని సందేశం పంపారు. అలాంటి వ్యక్తికి నాకు మధ్య తేడా ఏముంటుంది. కాకపోతే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చెడును ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అలా చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సోషల్ మీడియాని మంచికి ఉపయోగించాలని కోరుకుంటున్నా".

ఈ కథ విన్నాక ఎన్టీఆర్ స్పందనేంటి? మీకెలాంటి ప్రోత్సాహాన్నిచ్చారు?

"తారక్ ఏదైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ఎక్కడా రాజీ పడరు. బాగున్నా.. బాలేకున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఈ కథ చెప్పగానే తను చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడితో సమానం. దేవర పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో తన కొడుకు వర పాత్ర అంతకు మించేలా ఉంటుంది".

ఈ చిత్రంతో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి పని చేయడం ఎలా అనిపించింది?

"జాన్వీ చాలా ప్రతిభావంతురాలు. తొలి రోజు సీన్ పూర్తవగానే తన ప్రతిభ చూసి నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. అంత గొప్పగా చేసింది. కథ రాసుకున్నప్పుడే భైరా పాత్రకు సైఫ్ అయితేనే సరిపోతారనిపించింది. ఎంతో మంది లెజెండరీ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం కష్టపడ్డారు".

ఇది మీ తొలి పాన్ ఇండియా చిత్రం కదా. బడ్జెట్, ప్రచార విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"బడ్జెట్ చూసుకోవడం చాలా కష్టం. అన్ని కోణాల్లో నిర్మాతలకు లాభాలు రావాలని చూస్తుంటా. ఓటీటీ హక్కుల గురించి కూడా ఆలోచిస్తా. ఇక మార్కెటింగ్ విషయంలో నేను కొంచెం వీక్. నా కథకు న్యాయం చేయడం కోసమే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటా. నిర్మాతల్ని దృష్టిలో పెట్టుకుని ప్రచారం విషయంలో వాళ్లకు సలహాలిస్తుంటా".



ఎర్ర మందారం... మెరుపు సింగారం

ఓ వైపు సినిమాల్లో వారి నటనతో సినీప్రియుల్ని మురిపిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు, వీలు చిక్కినప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తళుక్కున మెరుస్తుంటారు మన అందాల నాయికలు. తాజాగా కథానాయికలు ఐశ్వర్య రాయ్, అలియా భట్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని సందడి చేశారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఈ ఫ్యాషన్ షోలో ఐశ్వర్య ఎర్రమందారంలా ఎరుపు రంగు దుస్తుల్లో అలరించింది. తొలిసారి ఈ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన అలియా నలుపు, వెండి రంగు డ్రెస్‌లో మెరిసింది. హాలీవుడ్ అందాల తారల మధ్య ఈ ఇద్దరూ ర్యాంప్‌పై ఆకట్టుకున్నారు.

కొత్త ప్రపంచాన్ని చూపించే జటాధర


సుధీర్‌బాబు

"ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఎన్నో విషయాలు మా 'జటాధర' చిత్రంలో ఉన్నాయంటు"న్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కళ్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్ర 'సెకండ్ లుక్'ను మంగళవారం విడుదల చేశారు. అందులో సుధీర్ బైక్‌పై వస్తుండగా.. ఆకాశంలో ఓ మహాశక్తి అవతారం కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో అడుగు పెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శక్తియు, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్లకు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాని ప్రేరణ రూపొందిస్తున్నారు" అన్నారు.

రోమ్‌ను కాపాడేందుకు 'గ్లాడియేటర్' పోరు



మరిన్ని విశేషాలు www.eenadu.net లో



సునీల్‌నారంగ్, రాకేందు మౌళి, ప్రశాంత్ వర్మ, కార్తి, శ్రీదివ్య, ప్రేమ్‌కుమార్, సురేశ్‌బాబు

సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం

"'ఊపిరి' నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. దాని తర్వాత మళ్లీ అంతే ప్రత్యేకమైన చిత్రం 'సత్యం సుందరం'. ఇలాంటి సినిమాలు తెరపైకి రావడం చాలా కష్టం. ఇది తప్పకుండా అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ తెరకెక్కించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. శ్రీదివ్య కథానాయిక. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో బావ..బామ్మర్దుల భావోద్వేగాల్ని చూస్తారు. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కు ఫోన్ చేసి మాట్లాడతారు. మాది 'సిరిమల్లె చెట్టు'లాంటి అందమైన చిత్రం" అన్నారు. ఈ కార్యక్రమంలో విష్వక్ సేన్, శ్రీదివ్య, ప్రశాంత్ వర్మ, డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ సమస్యని చర్చిస్తూనే నవ్వులు పంచాం


హసిత్ గోలి

'రాజ రాజ చోర'తో తొలి ప్రయత్నంలోనే సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు హసిత్ గోలి. ఇప్పుడాయన హీరో శ్రీవిష్ణుతో కలిసి రెండో ప్రయత్నంగా 'శ్వాగ్'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. వీళ్ల కాంబోలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు 4న రానున్న నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హసిత్.

★ "వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ, దాన్ని సినిమాలోకి తీసుకురావడం అరుదు. ఈ కథ అదే నేపథ్యంతో సాగుతుంది. ఇందులో ఓ వంశ వృక్షంలోని పలు భిన్న తరాల కథల్ని చెప్పనున్నాం. దీంట్లో శ్రీవిష్ణు నాలుగు భిన్న పాత్రల్లో కనిపిస్తారు. అలాగే ఇంకొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి".

★ "ఇది సందేశం కోసం తీసిన చిత్రం కాదు. కాకపోతే ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఓ సమస్యను చర్చిస్తుంది. తరతరాలుగా ఆడ, మగల మధ్య ఆధిపత్య పోరు ఎలా మారుతూ వచ్చింది.. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్ష ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా చూపించాం. అలాగే మాతృస్వామ్య వ్యవస్థను ఇందులో చూపించనున్నాం".

★ "భిన్న గెటప్స్‌తో కూడిన సినిమా చేయడం శ్రీవిష్ణుకే కాదు మాకూ కొత్తే. కానీ, దీన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకుని కష్టపడి ఈ చిత్రం చేశాం. తెరపై విష్ణు కాకుండా ఆయన చేసిన పాత్రలే కనిపిస్తాయి".

తండ్రి ఆరాటం.. కొడుకు పోరాటం!


శ్రీహర్ష, కషిక కపూర్

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా పవన్ కేతరాజు తెరకెక్కిస్తున్న చిత్రం 'లైఫ్'. లవ్ యువర్ ఫాదర్.. అన్నది ఉపశీర్షిక. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. ఎస్పీ చరణ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. దర్శకుడు పవన్ మాట్లాడుతూ.. "తన బిడ్డ బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం.. ఆ తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది" అన్నారు.

సీఆర్డీఏలో ఉద్యోగ ప్రకటనలు

డిప్యుటేషన్, ఒప్పంద ప్రాతిపదికన భర్తీకి చర్యలు



ఈనాడు – అమరావతి: సీఆర్డీఏలో కీలకమైన పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయి. వైకాపా హయాంలో కార్యకలాపాలు నిలిచిపోయి నిస్తేజంగా మారిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ఇప్పుడు క్రియాశీలకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో డిప్యుటేషన్‌పై వచ్చిన వారినీ కక్షగట్టి సాగనంపారు. రాజధానిలో త్వరలో పనులు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఆర్డీఏలోని అన్ని విభాగాలను పటిష్ఠం చేస్తున్నారు. ఇందులో భాగంగా సీఆర్డీఏలోకి ప్రతిభావంతులైన అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పలు పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇందుకు రెండు ఉద్యోగ ప్రకటనలను కమిషనర్ కాటమనేని భాస్కర్ జారీ చేశారు.

మళ్లీ పూర్వ కళ...: గత తెదేపా హయాంలో సీఆర్డీఏలో ఐదు శాఖల్లో 778 పోస్టులను మంజూరు చేసింది. అప్పట్లో 494 మంది అధికారులు, సిబ్బంది పనిచేశారు. వీరిలో సీఆర్డీఏ రెగ్యులర్ ఉద్యోగులు 83 మంది, పూర్వ వీజీటీఎం ఉడా సిబ్బంది.. 43, సీఆర్డీఏ ఒప్పంద సిబ్బంది 112, పొరుగుసేవల సిబ్బంది 140 మంది, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్లపై 116 మంది చొప్పున విధులు నిర్వర్తించారు. 2019లో వైకాపా వచ్చిన తర్వాత పనులను ఆపేసి, ఉన్న వారిని పంపారు. చాలా మంది తమ మాతృ శాఖలకు వెళ్లిపోయారు. గతంలో మంజూరైన అన్ని పోస్టులను భర్తీ చేస్తామని ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ పలు సార్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టులను నింపేందుకు కసరత్తు చేస్తున్నారు.

డిప్యుటేషన్‌పై 108, ఒప్పంద ప్రాతిపదికన 12 పోస్టులు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని డిప్యుటేషన్‌పై సీఆర్డీఏకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్న వారి కోసం జారీ చేశారు. ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈ హోదాల్లో మూడేళ్ల కాలానికి పనిచేసేందుకు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్, స్ట్రక్చరల్, తదితర విభాగాల్లో ఇంజినీరింగ్ చేసిన వారు అర్హులుగా పేర్కొన్నారు. పోస్టులను బట్టి రెండు నుంచి 12 ఏళ్ల అనుభవం ఉన్న వారు కావాలని ఉద్యోగ ప్రకటనలో కోరారు. వచ్చే నెల 4 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. 108 పోస్టులను డిప్యుటేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఏడాది కాలానికి ఒప్పంద పద్ధతిన పనిచేసేందుకు 12 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. లీగల్ మేనేజర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, ఎన్విరాన్‌మెంటలిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ స్పెషలిస్ట్, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, కంటెంట్ రైటర్, గ్రాఫిక్ డిజైనర్, వీడియో ఎడిటర్, ఎంఐఎస్ ఆపరేటర్, కమ్యూనికేషన్స్ జేడీ పోస్టుల కోసం పిలిచారు. బ్యాంకుల కన్సార్షియం, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, తదితర బ్యాంకులతో సమన్వయం కోసం, సామాజిక మాధ్యమాల్లో రాజధాని, సీఆర్డీఏ కార్యకలాపాలను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు ప్రధానంగా కాంట్రాక్టు పోస్టులను నిర్దేశించారు.

విద్యాసాగర్ కస్టడీపై వాదనలు రేపటికి వాయిదా


ఈనాడు – అమరావతి: కాదంబరీ జెత్వానీ పెట్టిన కేసులో రిమాండ్‌లో ఉన్న వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ కస్టడీ పిటిషన్‌పై వాదనలు గురువారానికి వాయిదా పడ్డాయి. మంగళవారం విజయవాడలోని నాలుగో ఏసీఎంఎం కోర్టులో నిందితుడి తరపు న్యాయవాదులు కౌంటరు దాఖలు చేయాల్సి ఉంది. దీనికి వారు సమయం కోరారు. దీంతో కౌంటరు దాఖలు, వాదనల నిమిత్తం న్యాయాధికారి రామ్మోహన్ 26వ తేదీకి వాయిదా వేశారు. అదే రోజు వాదనలు పూర్తి అయితే.. తీర్పు కూడా వచ్చే అవకాశం ఉంది. సోమవారం ఇన్‌ఛార్జి కోర్టు అయిన మూడో ఏసీఎంఎం కోర్టులో పోలీసులు విద్యాసాగర్‌ను ఏడు రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమే.


పత్తికి వరద పోటు... కౌలు రైతు ఆత్మహత్య

కంచికచర్ల, న్యూస్‌టుడే: కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మందా శివయ్య (42) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఈ ఏడాది 5 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశారు. వ్యవసాయం ఖర్చుల నిమిత్తం సుమారు రూ.2 లక్షలు అప్పు చేశారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంట మొత్తం తుడుచుపెట్టుకుపోయింది. పెట్టుబడి మొత్తం వరద పాలైంది. అప్పులు తీర్చే మార్గం కనిపించక శివయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లోనే పురుగుల మందు తాగారు. గమనించి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతనిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందారు. శివయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. రాజు తెలిపారు.


శివయ్య (పాత చిత్రం)

ఆపద్బాంధవులు..!


సీఎం చంద్రబాబుకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న ఎంపీ శివనాథ్, ఈశ్వరరావు, సురేష్, రాజా, వెంకట రమేష్, జగదీశ్వరరావు


ముఖ్యమంత్రికి రూ.10 లక్షల విలువైన చెక్కు అందజేస్తున్న జయప్రకాశ్ నారాయణ, నాగార్జున తదితరులు



ఎమ్మెల్యే సౌమ్యకు రూ.13.76 లక్షల చెక్కు ఇస్తున్న ప్రైవేట్ పాఠశాలల సంఘం నేతలు


తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు రూ.15.19 చెక్కు ఇస్తున్న అప్సా ప్రతినిధులు

నందిగామ, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు నందిగామ నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంఘం ముందుకు వచ్చింది. సీఎం సహాయనిధికి రూ.13.76 లక్షలు అందించింది. నందిగామలో మంగళవారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను సంఘం ప్రతినిధులు కలిసి చెక్కు అందించారు. ఎమ్మెల్యేని సత్కరించారు. సౌమ్య మాట్లాడుతూ.. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రైవేట్ పాఠశాలల సంఘం ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఏపీపీఎస్ఏ డెమోక్రటిక్ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు వై.రమేష్, కార్యదర్శి మహ్మద్ మస్తాన్, కోశాధికారి కిరణ్‌కుమార్, సభ్యులు కాపా రవీంద్రనాథ్, వీరేష్‌కుమార్, వేమూరి పూర్ణేష్, పగిడిపల్లి దేవసహాయం, రత్నవినోద్, సరికొండ అఖిల్, పాములపాటి రాంబాబు, రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు తిరువూరు డివిజన్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో తిరువూరు డివిజన్ పరిధిలోని 35 ప్రైవేట్ పాఠశాలలు తమ విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో రూ.15.19 లక్షలు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయనిధికి జమ చేసిన చెక్కును మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు కె.నరసింహారావు, ఎన్.వెంకటేశ్వరరావు, ఎం.కిశోర్‌బాబు, యు.చక్రపాణి, బీఎస్ఆర్ రెడ్డి, ఎస్ఎన్‌బీ చారి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : వరద బాధితులకు ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఫైనాన్షియర్స్ అసోసియేషన్ సభ్యులు బాసటగా నిలిచారు. సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళాన్ని ఇచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ, కార్యదర్శి వి.నాగార్జున, కోశాధికారి టి.హరికృష్ణ, సుంకర వీరభద్రరావు, బి.వై.నారాయణరావు కలిసి చెక్కు అందజేశారు.

❖ ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ వరద బాధితులకు అండగా నిలిచింది. సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళాన్ని ఇచ్చింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో స్టోర్స్ అధ్యక్షుడు కోనేరు వెంకట రమేష్, కార్యదర్శి కోనేరు జగదీశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. జగదీశ్వరరావు తన వ్యక్తిగత సాయంగా రూ.లక్ష ఇచ్చారు. విజయవాడ కృష్ణా డిస్ట్రిక్ట్ ట్రైలర్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సూరపనేని సురేష్, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు నాగుమోతు రాజా తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఫుట్‌బాల్ అభివృద్ధికి కృషి


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న శ్రీధర్, కమలాకరరెడ్డి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళా ఫుట్‌బాల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. కానూరులోని అనుమోలు ప్రభాకర్ మైదానంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ మహిళా ఫుట్‌బాల్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గతంలో కంటే ప్రస్తుతం రాష్ట్రంలో ఫుట్‌బాల్ ఆట అభివృద్ధి చెందిందన్నారు. పోటీలకు 12 జిల్లాల నుంచి క్రీడాకారిణులు రావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ఎన్‌హెచ్‌ఆర్‌సీ (ఇంజినీరింగ్ వింగ్) ప్రధాన కార్యదర్శి కొమ్మసాని కమలాకరరెడ్డితో కలిసి కోటగిరి శ్రీధర్ క్రీడాకారిణులను పరిచయం చేసుకున్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ముని శ్రీనివాసరావు, కార్యదర్శి డానియేల్ ప్రదీప్, కోశాధికారి విజయ్, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఆలీబాబా తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమాఖ్య ప్రతినిధుల సమావేశం నేడు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. మొగల్రాజపురంలోని రేషన్ డీలర్ల రాష్ట్ర సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేషన్ డీలర్లకు ఒకే పంపిణీ విధానం, ఒకే కమీషన్, గౌరవ వేతనం అమలు చేయడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ నెల 25న మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆల్ ఇండియా రేషన్ డీలర్ల సమాఖ్య ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి డీలర్లు వస్తారని తెలిపారు. సమావేశంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎం.సి.హెచ్. ఖాసిం, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం అభివృద్ధికి సహకరించండి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి ప్రాంతంలో ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించేలా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం సమర్పించినట్లు ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. మంగళవారం ఉండవల్లిలో లోకేశ్‌ను కలిసి ఏసీఏ స్టేడియం అభివృద్ధిపై పలు సూచనలు చేసినట్లు ఎంపీ వివరించారు. వెస్టర్న్ బైపాస్ నుంచి స్టేడియానికి వచ్చేందుకు అనుబంధ రోడ్లు, నిడమర్రు రైల్వే లైన్ దగ్గర ఆర్వోబీ నిర్మాణం, పార్కింగ్‌కు స్థలం, డ్రైనేజీ ఏర్పాటుతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని వినతి పత్రంలో కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


డీఆర్ఎం నరేంద్రకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ విజయవాడ డివిజనల్ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రన్నింగ్ సిబ్బందికి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. వారికి వారాంతపు సెలవులు ఇవ్వాలన్నారు. అనారోగ్యానికి గురైన సిబ్బందికి రైల్వే ఆస్పత్రిలో సిక్‌లు కూడా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రూ లింక్‌ల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా డిపో ఇన్‌ఛార్జి ఇష్టానుసారం విధులకు పంపుతున్నారని ఆరోపించారు. రన్నింగ్ కార్మికుల పని గంటలు 12 గంటలు మించకూడదని రైల్వే బోర్డు ఇచ్చిన ఆదేశాలను ఇక్కడి అధికారులు పాటించడం లేదని విమర్శించారు. అనంతరం డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రన్నింగ్ సిబ్బంది పాల్గొన్నారు.